

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

## కరీంనగర్

పెద్దపల్లి, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల

బుధవారం 18 మార్చి 2026 | 15 పేజీలు




# పూత ఘనంగా... పిందెలు స్వల్పం

# నష్టాల్లో మామిడి రైతులు

- మామిడి తోటలకు వాతావరణ దెబ్బ... రైతులకు భారీ నష్టం
- పిచికారీ చేసినా ఫలితం లేదు... పిందెలు రాలిపోతున్నాయి
- హార్టికల్చర్ అధికారుల నిర్లక్ష్యం... రైతుల ఆవేదన
- లక్షల పెట్టుబడులు వృథా... మామిడి రైతుల కష్టాలు
- పూత వచ్చినా కాయలు లేవు... కౌలు రైతుల దుస్థితి
- మామిడి తోటల్లో నష్టాలు... ప్రభుత్వం ఆదుకోవాలని రైతుల డిమాండ్

సూర్య మల్యాల

మల్యాల మండలంలో ఈ యాసంగి సీజన్‌లో మామిడి పూత విపరీతంగా వచ్చినప్పటికీ, పిందెలు నిలవకపోవడంతో రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాటి పెల్లి, నూకపెల్లి, రాంపూర్, సర్వాపూర్, మద్దుట్ల, ఓగులాపూర్, గొర్రగుండం, మ్యాడంపల్లి, తక్కలపల్లి, మల్యాల గ్రామాలతో పాటు మండలంలోని సుమారు 4,000--4,500 ఎకరాల్లో ఈ పరిస్థితి నెలకొంది.తేనెమంచు ప్రభావం, మారుతున్న వాతావరణ పరిస్థితుల కారణంగా పూత నిలవకుండా రాలిపోతుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. 8లో

# రీల్స్ జోడీ మధ్య రియల్ విషాదం

## - గర్భిణి అని చూడకుండా భార్యను నరికి చంపిన భర్త

## - కోరుట్లలో ఘటన



సూర్య కోరుట్ల

**సోషల్ మీడియాలో ఎంతో అన్యోన్యంగా కనిపిస్తూ, వేలమంది ఫాలోవర్లను సంపాదించుకున్న ఆ జంట వెనుక ఇంతటి విషాదం దాగి ఉందని ఎవరూ ఊహించలేదు. కంటికి రెప్పలా చూసుకోవాల్సిన భర్తే కాలయముడయ్యాడు ఐదు నెలల గర్భిణి అని కూడా చూడకుండా, ప్రాణప్రదంగా ప్రేమించిన భార్యను కత్తితో కిరాతకంగా నరికి చంపిన ఘటన కోరుట్ల మండలంలోని మాదాపూర్ లో తీవ్ర కలకలం రేపింది....**



### - ప్రేమ.. పెళ్లి.. సోషల్ మీడియా క్రేజ్

కోరుట్ల మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన వైష్ణవి, కోరుట్ల పట్టణానికి చెందిన హరిబాబులకు సోషల్ మీడియా వేదికగా పరిచయం ఏర్పడింది. వైష్ణవి చేసే ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ చూసి హరిబాబు ఆమెతో ప్రేమలో పడ్డాడు. వీరిద్దరి కులాలు ఒక్కటే అయినప్పటికీ హరిబాబు ఇంట్లో పెళ్లికి ఒప్పుకోలేదు. దీంతో తొమ్మిది నెలల క్రితం పెద్దలను ఎదిరించి వీరు వివాహం చేసుకున్నారు. వైష్ణవి కుటుంబ సభ్యులు వీరి ప్రేమను అంగీకరించి, తమ ఇంటి వద్దే నివాసం ఉండేందుకు చోటిచ్చారు. నిత్యం రీల్స్ చేస్తూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే ఈ జంటను చూసి (మిగతా 8లో)

## అసంపూర్తిగా

# మన ఊరు - మనబడి పనులు

## - బిల్స్ రాక చేతులెత్తేసిన కాంట్రాక్టర్



సూర్య, హుజురాబాద్

విద్యాలయాలలో మౌలిక వసతులను కల్పించే ఉద్దేశంతో గత ప్రభుత్వం రూపొందించిన మన ఊరు - మనబడి పనులు అసంపూర్తిగా ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో హుజురాబాద్ మండలంలోని పలు పాఠశాలల్లో కిచెన్ షెడ్లు, డైనింగ్ హాల్స్ నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ఇందులో భాగంగా హుజురాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 32 లక్షల రూపాయల వ్యయంతో డైనింగ్ హాల్, కిచెన్ షెడ్ నిర్మాణానికి టెండర్లు పిలిచారు. టెండర్ ప్రకారం కాంట్రాక్టర్ నిర్మాణ పనులు చేపట్టారు. వచ్చిన బిల్లులతో స్లాబ్ లెవెల్ వరకు గోడలను (మిగతా 8లో)

# కెమెరాకు చిక్కిన పెద్దపులి...

## - జె-1గా గుర్తింపు

## - సీసీ ఫుటేజ్ విడుదల చేసిన అధికారులు



సూర్య కొడిమ్యాల

కొడిమ్యాల మండల కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయంలో మంగళవారం మీడియా సమావేశం నిర్వహించి పెద్దపులి సంచారానికి సంబంధించిన సీసీ ఫుటేజీని అటవీశాఖ అధికారులు విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా అటవీ అధికారి (డీఎఫ్ఓ) రవిప్రసాద్ మాట్లాడుతూ ఆ పులిని జె--1 పెద్దపులిగా (మిగతా 8లో)





# విద్యార్థులకు అంతర్జాతీయ విషయాలపై అవగాహన పెంపొందించాలి

## - జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్. లత

**సూర్య జగిత్యాల ప్రతినిధి**

విద్యార్థులలో అంతర్జాతీయ అంశాలపై అవగాహన పెంపొందించేందుకు జిల్లా విద్యాశాఖ, జిల్లా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో మంగళవారం నాడు నమూనా ఐక్యరాజ్యసమితి కార్యక్రమాన్ని కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్.లత మాట్లాడుతూ వనరులపై అధిపత్యము కోసమే అనేక యుద్ధాలు జరిగాయని ప్రస్తుతం కూడా చమురుపై ఆధిపత్యం కోసం యుద్ధాలు జరుగుతున్నాయని తెలిపారు. మనం ఇతరులపై ఆధారపడకుండా మనకు మనమే అనగా ప్రతి గ్రామం స్వయం సమృద్ధి సాధించేలా విద్యార్థులందరూ కృషి చేయాలని ఆశించారు. ఈ కార్యక్రమానికి హాజరైన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచ




వ్యాప్తంగా జరుగుతున్న యుద్ధ వాతావరణంలో ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని అన్నారు.ప్రపంచశాంతిని కాపాడటంలో అంతర్జాతీయ సంస్థలు కీలక పాత్ర పోషించాలని లేదంటే మూడవ ప్రపంచ యుద్ధం సంభవిస్తే ప్రపంచం మొత్తం అంతమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పిల్లలు ఇట్టి కార్యక్రమంలో పలు విషయాలపై అవగాహన చేసుకుంటే అవి ఉపయోగకరంగా ఉండి భవిష్యత్ తరాలకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి కె. రాము మాట్లాడుతూ తక్కువ సమయంలో విద్యార్థులను సిద్ధం చేసి పిల్లలకు మంచి మార్గదర్శనం చేసిన ఉపాధ్యాయులను చురుకుగా పాల్గొన్న విద్యార్థులను అభినందించి ఇటువంటి కార్యక్రమంలో నేర్చుకున్న అంశాలు తరతరాలకు భవిష్యత్తులో ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమారు 50 మంది విద్యార్థులు వివిధ పాఠశాలల నుండి వివిధ దేశాల ప్రతినిధులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష కోఆర్డినేటర్లు చంద్రశేఖర్ రెడ్డి, సత్యనారాయణ, నీరజా,మహేష్, జిల్లా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు ఫోరం అధ్యక్షుడు జోగ రవి, కార్యదర్శి దాసరి రామస్వామి, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు భోనగిరి దేవయ్య కొమరయ్య, మహేష్, జక్కుల రవి అజీమ్, పద్మ, సతీష్‌లు తదితరులు పాల్గొన్నారు.

# బాధితుల సౌకర్యం కోసమే "ఆన్సైట్ ఎఫ్ ఐ ఆర్" విధానం అమలు

## - జిల్లాలో ఇప్పటివరకు 5 కేసులు నమోదు - జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

**సూర్య జగిత్యాల**

ప్రజలకు మరింత వేగవంతమైన, సౌకర్యవంతమైన పోలీస్ సేవలు అందించాలనే లక్ష్యంతో తెలంగాణ పోలీస్ శాఖ కీలక ముందడుగు వేసిందని దానిలో భాగంగానే ఆన్సైట్ ఎఫ్ఐఆర్ విధానాన్ని అమలు చేస్తున్నామని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు కొన్ని ప్రత్యేక నేరాల్లో బాధితులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా, వారి వద్దకే వెళ్లి ఎఫ్ఐఆర్ నమోదు చేసే "ఆన్సైట్ ఎఫ్ఐఆర్" విధానాన్ని జిల్లా వ్యాప్తశీగా అమలు చేస్తున్నామని అన్నారు.నేరం జరిగిన తరువాత శారీరకంగా, మానసికంగా ఇబ్బందులు పడుతున్న బాధితులకు పోలీస్ స్టేషన్‌కు వెళ్లడం ఒక భారంగా మారకూడదనే ఉద్దేశంతో ఈ విధానాన్ని ప్రవేశపెట్టినట్లు ఎస్పీ పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పోలీస్ స్టేషన్లలో ఈ విధానం అమలులో ఉందని తెలిపారు.



ఇప్పటికే ఈ విధానం ద్వారా జిల్లాలో 5 కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుల వద్ద నుంచే ఫిర్యాదును స్వీకరిస్తారు. ఫిర్యాదుదారులు డయల్ 100కు కాల్ చేసినా, నేరుగా సమాచారం ఇచ్చినా వెంటనే స్పందించి ట్యాబ్‌ల ద్వారా ఆన్లైన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేస్తారనీ తెలిపారు.రోడ్డు ప్రమాదాలు, గొడవలు వంటి ఘటనల్లో గాయపడిన వారికి తక్షణ వైద్యసాయం అందిస్తూ ఆసుపత్రికి తరలిస్తారన్నారు. ఈ ఆన్సైట్ ఎఫ్ఐఆర్ విధానం ద్వారా రోడ్డు ప్రమాదాలు, గొడవలు, దొంగతనాలు, భార్యాభర్తల వివాదాలు, వేధింపులు, అనుమానాస్పద మృతులు వంటి కేసులను సంఘటనా స్థలంలోనే తక్షణం నమోదు చేసే అవకాశం కలుగుతుందనీ వెల్లడించారు. ఈ విధానం ద్వారా బాధితులకు త్వరిత న్యాయం అందించడమే కాకుండా, పోలీస్ సేవలపై ప్రజల నమ్మకం మరింత పెరుగుతుందని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు.



# మైనార్టీలకు రంజాన్ తోఫా ఇవ్వకపోవడం బాధాకరం

## - మాజీ జడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్

**సూర్య జగిత్యాల ప్రతినిధి**

మైనార్టీలకు రంజాన్ తోఫా ఇవ్వకపోవడం చాలా బాధాకరం అని జగిత్యాల మాజీ జడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్ అన్నారు. మంగళవారం జగిత్యాలలోని వారి నివాసంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రంజాన్ తోఫా ఇవ్వడం లేదు అని అన్నారు.ఈ ఏడాది కేవలం పరిమితంగా అందించే ప్రయత్నం చేసి, లబ్ది పొందాలని ప్రభుత్వం భావిస్తుంది. ప్రభుత్వం నిర్ణయంతో మైనార్టీ వర్గాలు ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని అన్నారు. గత బిఆర్ఎస్ పది సంవత్సరాల పాలనలో ప్రతి ఏడాది తోఫా ఇచ్చిన ఘనత కేసీఆర్ దే అన్నారు. హిందువు మహిళలకు బతుకమ్మ చీరెలు, ముస్లింలకు తోఫా, క్రిస్టియన్‌లకు క్రిస్మస్ కానుక అందించి ఆచారంగా మార్చిన ఘనత కేసీఆర్‌ది అని గుర్తు చేశారు.జగిత్యాల నియోజకవర్గంలో గత పాలనలో 4000 తోఫాలు ఇస్తే, ప్రస్తుతం 1200 తోఫాతో సరిపెట్టే కుట్ర చేస్తుంది. రంజాన్ మాసం అయిపోయే సమయం కూడా వస్తుంది, మరి ఎమ్మెల్యే ముస్లిం సోదరులకు రంజాన్ తోఫా ఎందుకు పంపిణీ చేయడం లేదని ప్రశ్నించారు? ఇమామ్, మోజోన్లకు జీతాలు ఇచ్చింది మొట్టమొదటి సీఎం కేసీఆర్ అన్నారు. విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని కేసిఆర్ రాష్ట్రవ్యాప్తంగా 204 మైనార్టీ గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసి నమాజుతో పాటు ఇంగ్లీష్ మీడియంలో నాణ్యమైన విద్య బోధనను అందించారు. ఇందులో ఒక్కొక్క విద్యార్థికి లక్ష రూపాయల చొప్పున ఖర్చు చేయడం జరిగింది అన్నారు.



# దుబ్బరాజన్నను దర్శించుకున్న జెడ్పీ సీఈవో

**సూర్య సారంగాపూర్**

సారంగాపూర్ మండలం పెంబట్ల గ్రామంలో గల దుబ్బరాజన్న ఆలయాన్ని మంగళవారం జెడ్పీ సీఈవో గౌతం రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాలు అందజేశారు.ఆయన వెంట ఎంపీడీఓ సలీం, సర్పంచ్ కోలపాక రాధరాజు, ఆలయ సిబ్బంది రజినీకాంత్, శివ, పంచాయతీ కార్యదర్శులు తిరుపతి,నరేష్ , కారోబార్ శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.



# రైతుల సమస్యలకు ముగింపు పలికేలా రి సర్వేలో పాల్గొనాలి

## - అదనపు కలెక్టర్ బి.ఎస్.లత

**సూర్య రాయికల్**




భూ సమస్యలకు ముగింపు పలికేలా రైతులు రిసర్వే లో పాల్గొనాలని అదనపు కలెక్టర్ బిఎస్.లత అన్నారు.రాయికల్ మండలంలోని ధావన్ పల్లి గ్రామంలో భూభారతి 2025-భూ సర్వేలో భాగముగా రీ సర్వేపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ బి ఎస్ లత మాట్లాడుతూ గ్రామంలో ఎటువంటి భూ సమస్యలు కొత్తవి పునరావృతం కాకుండా,పాత సమస్యలకు ముగింపు పలికెలా రైతులు రిసర్వేలో భాగస్వాములు కావలని అన్నారు.సర్వే అనంతరం భూదార్ కార్డులు జారీ చేస్తారు అని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్,తహసిల్దార్ నాగార్జున,ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ కిషన్ ప్రసాద్,డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ విఠల్రావు,రెవెన్యూ ఇన్స్పెక్టర్ పద్మయ్య, మండల సర్వే అధికారి నరేందర్,గ్రామ సర్పంచ్ ప్రసాద్,కార్యదర్శి,జిపిఓలు లావణ్య,స్వప్న, లైసెన్సు సర్వేయర్లు ప్రభాస్,వంశీ,రాంసింగ్, గ్రామ ప్రజలు, సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థినులతో 119 మంది ఎమ్మెల్యేకు పోస్టు కార్డుల ద్వారా వినతి

**సూర్య జగిత్యాల ప్రతినిధి**



ప్లాస్టిక్ వద్దు! పర్యావరణహితమే ముద్దు!! అంటూ ప్లాస్టిక్ నివారణ కొరకు పోస్టల్ కార్డు ఉద్యమాన్ని చేపట్టిన సీనియర్ న్యాయవాది నాగిరెడ్డి మధుసూదన్ రెడ్డి తన సొంత గ్రామం జగిత్యాల రూరల్ మండలం గుల్లపేటలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులలో గ్రామస్తులలో ప్లాస్టిక్ నివారణ ఉద్యమ స్ఫూర్తిని రగిలించారు. దీనిలో భాగంగా మంగళవారం విద్యార్థులచే తెలంగాణలోని 119 మంది ఎమ్మెల్యేలకు ప్లాస్టిక్ నివారణ గురించి తీసుకునే చర్యలకై పోస్టల్ కార్డు ద్వారా తమ వినతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు మంచాల మేఘన, గంగాధరి రక్షిత, కనికరపు హన్విత, గంగాధరి సాహిత్య, గొల్లపల్లి హాసిని, గుజ్జేటి వర్షిత, గంగాధరి వంశీ తదితరులు పాల్గొన్నారు గుల్లపేట గ్రామస్తులు అందరూ ప్లాస్టిక్ నివారణ చర్యలు తీసుకుంటామని ప్రమాణం చేస్తూ ఉద్యమ నేతను అభినందించారు.

# పరిసరాలను శుభ్రంగా ఉంచడానికి ప్రజలు కృషి చేయాలి

## - మున్సిపల్ చైర్మన్ రవీందర్

**సూర్య రాయికల్**




ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా 2వ వార్డులో పారిశుధ్య పనుల ను మున్సిపల్ చైర్మన్ కట్కం రవీందర్ పర్యవేక్షించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ కట్కం రవీందర్ మాట్లాడుతూ ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వార్డులోని ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని, పిచ్చి మొక్కలను ట్రాక్టర్లు డోజర్ల సహాయంతో తొలగించడం జరుగుతుందని,పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడమే ధ్యేయంగా పనులు చేపడుతున్నామని, ప్రజలు కూడా తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్‌లు, మున్సిపల్ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# అక్రమ కలప పట్టివేత....!

## - కట్టేకోత యంత్రం సీజ్ చేసిన అధికారులు

**సూర్య సారంగాపూర్**

సారంగాపూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తి అక్రమంగా కలప రవాణా చేస్తుండగా సోమ వారం అర్ధ రాత్రి అటవీ శాఖ అధికారులు పట్టుకున్నట్లు తెలిసింది.ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న గ్రామంలో అటవీ ప్రాంతం నుండి అక్రమంగా చెట్లను నరికి తరలిస్తున్నారనే సమాచారం మేరకు దాడులు చేసి 9 కర్ర దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. అలాగే అతనికి చెందిన చెందిన కట్టేకోత యంత్రం ను అటవీ అధికారులు సీజ్ చేసినట్లు సమాచారం.కాగా గతంలో సైతం నిందితుడు అటవీ అధికారులను తప్పుదోవ పట్టించి కలప రవాణా చేసేవాడని తెలిసింది.

# పన్నులు వసూలు నూరు శాతం పూర్తి చేయాలి

**- పారిశుద్ధ్య పనులు పక్కాగా చేయాలి - కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**- సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు, టీపీవోలు ఇతర అధికారులతో సమీక్ష**

**సూర్య రాజన్న సిరిసిల్ల**

సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ పరిధిలో ఇంటి, భవనాల పన్ను 100 శాతం వసూలు చేయాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక అమలు, ఇంటి పన్ను వసూలు, పారిశుధ్య పనులు, నీటి సరఫరా, మున్సిపల్ బడ్జెట్, తదితర అంశాలపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మంగళవారం సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు, టీపీవోలు ఇతర అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో ఇంటి, భవనాల పన్ను లక్ష్యం రూ.6 కోట్ల 99 లక్షలు కాగా, ఇప్పటిదాకా రూ.5 కోట్ల 66 లక్షలు వసూలు అయ్యాయని, వేములవాడ మున్సిపల్ పరిధిలో రూ.4 కోట్ల 54 లక్షలు లక్ష్యం కాగా, రూ.3 కోట్ల 18 లక్షలు వసూలు అయ్యాయని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ...లక్ష్యం మేరకు పన్నులు వసూలు చేయించాలని ఆదేశించారు. దీంతో 15 వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు అవుతాయని తెలిపారు. రెండు మున్సిపాలిటీల పరిధిలో నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బంది లేకుండా



చూసుకోవాలని సూచించారు. బోర్లకు మరమ్మత్తు చేయించాలని, పైప్ లైన్ లీకేజీ లేకుండా చూడాలని ఆదేశించారు. పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణ పకడ్బందీగా చేయాలని ఆదేశించారు. పబ్లిక్ పార్క్‌ల నిర్వహణ పై ప్రత్యేక దృష్టి సారించాలని, స్వచ్ఛంగా... పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని స్పష్టం చేశారు. ఏబీసీ కేంద్రాలను ప్రారంభించాలని సూచించారు. సెగ్రిగేషన్ షెడ్లు వినియోగంలోకి తీసుకురావాలని, తడి, పొడి చెత్త వేరు చేయాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.సమావేశంలో జిల్లా ఆడిట్ అధికారి శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇల్లు బిల్లుల చెల్లింపులో జాప్యం..!

**- స్లాబ్ పనులు పూర్తయిన ఇళ్లకు బిల్లులు చెల్లించాలని స్పష్టమైన ఆదేశాలున్న భేకాతర్...**

**- ఆరు నెలలుగా బిల్లులకై ఎదురుచూపులు - బంగారం అమ్మి అప్పులతో నిర్మాణాలు చేపట్టిన బిల్లు చెల్లించని వైనం**

**- పేదల ఇంటి కల నెరవేరేదెప్పుడో?**

**సూర్య గంభీరావుపేట**

గూడూలేక లేక ఇబ్బందులు పడుతున్న నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు నీడ నిస్తాయని ఇల్లు నిర్మించుకుంటే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతొంది. లబ్ధిదారులు మొదట తమ సొంత డబ్బుతో ఇంటి నిర్మాణం చేపట్టిన తర్వాత దశలవారీగా బిల్లులు చెల్లిస్తామనడంతో బంగారం అమ్మి అప్పులు చేసి ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం చేపడితే బిల్లులు రాక తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన కోట ఎల్లవ్వ ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడంతో జూన్‌లో



ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించింది. బేస్‌మెంట్ వరకు పూర్తయ్యాక రెండు నెలల తర్వాత మొదటి బిల్లు రూ.1లక్ష మంజూరి అయింది. మొదటి బిల్లు వెంటనే రావడంతో బంగారం అమ్మి అప్పులు తీసుకువచ్చి సుమారు 6 లక్షల రూపాయలుతో గోడలు, స్లాబ్, ప్లాస్టింగ్ కూడా పూర్తి చేసింది.కానీ ఆరు నెలలు గడిచిన రూ.3 లక్షల బిల్లులు రాకపోవడంతో వడ్డీ పెరిగి పోతుందని వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లించాలని ఎల్లవ్వ వేడుకుంటోంది. స్లాబు పనులు పూర్తయిన ఇళ్లకు బిల్లుల చెల్లింపులు ప్రాధాన్యత ఇవ్వాలన్న స్పష్టమైన ఆదేశాలున్న అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బిల్లుల జాప్యంపై గంభీరావుపేట హౌసింగ్ ఏఈని వివరణ కోరగా ఉన్నతాధికారుల వద్ద బిల్లు పెండింగ్‌లో ఉందని తొందరలోనే బిల్లు చెల్లిస్తామని తెలిపారు.

# ప్రజలు తడి, పొడి చెత్తను వేరు చేయాలి

**- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**సూర్య, వేములవాడ**

ప్రజల సహకారంతోనే పట్టణాలను పరిశుభ్రంగా ఉంచడం సాధ్యమవుతుందని, పట్టణాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచేందుకు ప్రజలు తడి చెత్త, పొడి చెత్తను తప్పనిసరిగా వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మంగళవారం వేములవాడ మండలం తెట్టెకుంట శివారులో వేములవాడ మున్సిపాలిటీకి సంబంధించిన పొడి వనరుల సేకరణ కేంద్రంలో నూతనంగా సమకూర్చిన యంత్రాలను మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, సంబంధిత అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మార్చి 6వ తేదీ నుంచి మున్సిపాలిటీలు, గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. పట్టణాల్లో చెత్త సేకరణ, చెత్త నిర్వహణను మరింత సమర్థవంతంగా చేసేందుకు పలు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.వేములవాడ మున్సిపాలిటీకి సంబంధించి ఇప్పటికే పొడి వనరుల సేకరణ కేంద్రం ఉండగా, ఇప్పుడు ఆ కేంద్రంలో ఏజెన్సీ ద్వారా నూతనంగా సమకూర్చిన యంత్రాలను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. చెత్తను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించడానికి ఈ యంత్రాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. మున్సిపాలిటీ వాహనాల



ద్వారా ఇంటింటికీ తిరిగి తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి సేకరిస్తున్నామని తెలిపారు. సేకరించిన పొడి చెత్తను ఈ కేంద్రానికి తీసుకువచ్చి యంత్రాల సహాయంతో ప్రాసెస్ చేసి కంపోస్ట్ తయారు చేస్తున్నామని చెప్పారు. దీనివల్ల చెత్త నిర్వహణ సక్రమంగా జరిగి పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పడుతుందని వివరించారు.ప్రజలు తమ ఇళ్లలోనే తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ వాహనాల్లో కూడా తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరు కంపార్ట్‌మెంట్లలో సేకరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. చెత్తను వేరు చేయడం వల్ల రీసైక్లింగ్ ప్రక్రియ సులభమవుతుందని, తడి చెత్త, పొడి చెత్త కలిసి పోవడం వల్ల డంపింగ్ యార్డుల్లో సమస్యలు తలెత్తకుండా నివారించవచ్చని తెలిపారు. ఈ డీఆర్‌సీసీ కేంద్రంలో ఒక బేలింగ్ మెషిన్, ఒక వెయిమెంట్ మెషిన్ ఏర్పాటు చేయగా, ఈ కేంద్రం 15 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో పనిచేస్తుందని తెలిపారు. అలాగే కంపోస్ట్ కేంద్రం కూడా 15 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో ఏర్పాటు చేయబడిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కొక్కుల బాలకృష్ణ, అన్నారం శ్రీనివాస్, తూమ్ మధు, ఎల్ల శ్రీనివాస్, తోట రాజు, కాషా శ్రీనివాస్, మూడపల్లి నీలమ్మ,మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## రేవంతన్నాకా సహారా - మిస్కీన్‌కు లబ్దిదారుల ఎంపిక

**సూర్య రాజన్న సిరిసిల్ల**



తెలంగాణ మైనారిటీల సంక్షేమం కోసం మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం పొందుపరచిన లిరేవంతన్నాకా సహారా-మిస్కీన్‌ల కోసం” పథకం కోసం లబ్ధిదారుల ఎంపిక ను మంగళవారం నిర్వహించారు.జిల్లాలోని ఫఖీర్,దూదేకుల, దూదేకుల ముస్లిం కమ్యూనిటీ అభ్యున్నతి, సంక్షేమం కోసం సభ్యులకు మోపెడ్‌లు, బైక్, ఈ-బైక్‌లను అందించేందుకు జిల్లాకు కేటాయించిన లక్ష్యం అనుసారంగా ఐదుగురు లబ్దిదారులను జిల్లా స్క్రీనింగ్ కం సెలక్షన్ కమిటీ సభ్యుల సమక్షంలో కమిటీ చైర్మన్ జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ లక్కీ డిప్ ద్వారా ఎంపిక చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి భారతి తదితరులు ఉన్నారు.

## విలాసాగర్ రైతు వేదికలో రైతులకు శిక్షణ

**- మండల వ్యవసాయ అధికారి ప్రణీత**

**సూర్య బోయినపల్లి**



జాతీయ సహజ వ్యవసాయ మిషన్ పథకంలో భాగంగా మంగళవారం విలసాగర్ రైతు వేదికలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించరు. విలసాగర్ గ్రామంలో 125 మంది రైతులు ఒక్కొకరు ఒక ఎకరం చొప్పున సహజ పద్దతుల్లో ప్రకృతిలో లభించే పోషకాల ద్వారా వ్యవసాయం చేయడానికి విలాసాగర్ గ్రామం ఎన్నిక కావడం జరిగింది. ఈ 125 మంది రైతుల పొలాల నుండి మట్టి నమూనాలను సేకరించరు. వాటి యొక్క పరీక్ష ఫలితాలని భూసార పరీక్ష ఫలితాల కార్డులు కిట్లని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి మండల వ్యవసాయ అధికారి ప్రణీత, అయిా ఫౌండేషన్ జిల్లా కో ఆర్డినేటర్ శ్రీకాంత్, సర్పంచ్ ఏనుగుల కనుకయ్య, ఏఈఓలు రజిత, లక్ష్మణ్, రవళి పాల్గొన్నారు.

## మెగా వైద్య శిబిరం

**సూర్య, తంగళ్లపల్లి**




ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా తంగళ్ళపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తంగళ్ళపల్లి సర్పంచ్ మోర లక్ష్మీరాజం మాట్లాడుతూ... కాంగ్రెస్ పాలనలో ప్రతి ఒక్కరికి లబ్ధి చేయి కోరుతుందన్నారు. వార్డు సభ్యులు కీర్తన, పద్మ, రోజ, మల్లేశ్వరి, హనుమండ్లు వైద్య సిబ్బంది, ప్రజలు ఉన్నారు.

## మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు

**- సర్పంచ్ అర్చన-ఆంజనేయులు**

**సూర్య గంభీరావుపేట**



మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు అని నర్మాల గ్రామ సర్పంచ్ రాజబోయిన అర్చన-ఆంజనేయులు అన్నారు. మంగళవారం గంభీరావుపేట మండలం నర్మాల గ్రామంలోని మజిద్‌లో ముస్లిం సోదరులకు సర్పంచ్ అర్చన ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసి మాట్లాడారు. రంజాన్ ముస్లిం సోదరులకు పవిత్ర మాసమని, పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు ఆచరించే ముస్లిం సోదరులకు ఇచ్చే ఇఫ్తార్ విందు మత సామరస్యానికి ప్రత్యేకగా నిలుస్తాయని అన్నారు. ఉప సర్పంచ్ గొర్రె సుదర్శన్, నాయకులు రత్నాకర్ అనిల్ వెంకటస్వామి తదితరులు ఉన్నారు.

# జనగణనపై పూర్తి అవగాహనతో ముందుకెళ్లాలి

## - శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

జనగణన-2027 కోసం ఏర్పాటుచేసిన శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకొని స్పష్టమైన అవగాహనతో ముందుకెళ్లాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులకు సూచించారు. 2027 జనగణన పై అధికారులకు కలెక్టరేట్ లోని మర్రి చిన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో ఈనెల 15 నుండి చార్జ్ ఆఫీసర్లు, అదనపు ఛార్జ్ అధికారులు, జిల్లా అదనపు పు సెన్సెస్ అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి మంగళవారం హాజరైన జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ జన గణన కోసం సూచించిన ఆప్ రిజిస్ట్రేషన్, పనితీరు తదితర



అంశాలపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని అన్నారు. క్షేత్రస్థాయిలో అనేక సమస్యలు వస్తుంటాయని, ఉన్నతాధికారులను సంప్రదించి సందేహాలు నివృత్తి చేసుకొని పకడ్బందీగా సర్వే నిర్వహించాలని అన్నారు. టెక్నికల్ అంశాలు, నియమ నిబంధనలు స్పష్టంగా తెలుసుకోవాలని, నవీకరించిన మార్గదర్శకాలను పాటించాలని అధికారులకు సూచించారు. శిక్షణ ఇచ్చేవారు అధికారుల సందేహాలు నివృత్తి చేయాలని, ప్రతి అంశంపై క్షుణ్ణంగా వివరించాలని తెలిపారు. మండల చార్జ్ అధికారులుగా తహసిల్దార్లు, అదనపు చార్జ్ అధికారులుగా నాయబ్ తహసిల్దార్లు, పట్టణ చార్జ్ అధికారులుగా మున్సిపల్ కమిషనర్లు, అదనపు ఛార్జ్ అధికారులుగా టౌన్ ప్లానింగ్ అధికారులు, జిల్లా అదనపు సెన్సెస్ అధికారులుగా పలువురు జిల్లా స్థాయి అధికారులు శిక్షణ పొందుతున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మహేశ్వర్, జడ్పీ సీఈవో శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్, సిపిఓ రామ్ దత్తారెడ్డి తదితరులు ఉన్నారు.

# ఉగాది పర్వదిన వేడుకల కోసం ముస్తాబైన శ్రీ మహాశక్తి దేవాలయము

## - వేడుకలకు హాజరుకానున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

## - సాయంత్రం దేవాలయానికి రానున్న హంపి పీఠాధిపతి శ్రీ విద్యారణ్య భారతి స్వామీజీ

**సూర్య కరీంనగర్**

కరీంనగర్ లోని ముగ్గురు అమ్మవార్లు శ్రీ మహాదుర్గ, శ్రీ మహాలక్ష్మి, శ్రీ మహాసరస్వతిల మహిమాన్విత దివ్య క్షేత్రం శ్రీ మహాశక్తి దేవాలయం శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది (తెలుగు నూతన సంవత్సరం) వేడుకల కోసం సర్వాంగ సుందరంగా ముస్తాబయింది. శ్రీ శ్రీ శ్రీ జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతులు శ్రీ శ్రీ శ్రీ విద్యారణ్య భారతి స్వామి దివ్య ఆశీస్సులతో ఉగాది మహోత్సవ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించడానికి ఆలయ నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేశారు. గురువారం తెల్లవారుజామున 4:30 గంటలకు శ్రీ మహాదుర్గ, శ్రీ మహాలక్ష్మి, శ్రీ మహాసరస్వతి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకపూజ, విశేష అలంకరణ కార్యక్రమాలను



నిర్వహించనున్నారు. ఉదయం 7 గంటల నుండి ఆలయంలో ఉగాది పచ్చడిని అమ్మవారికి నివేదించి భక్తులకు ప్రసాదంగా అందించడానికి ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. అలాగే వేద పండితుల ఆధ్వర్యంలో కొత్త సంవత్సరానికి సంబంధించిన పంచాంగ వివరములు, రాశి ఫలాలు తదితర విశేషాలను తెలుసుకోవడానికి పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని గురువారం రోజున సాయంత్రం 6 గంటలకు ఆలయంలో నిర్వహించనున్నారు. పంచాంగ శ్రవణ కార్యక్రమానికి శ్రీ శ్రీ శ్రీ విద్యారణ్య భారతి స్వామితో పాటు కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ హాజరుకానున్నారు. శ్రీ మహాశక్తి ఆలయంలో ఉగాది వేడుకలు ఎంతో వైభవంగా ఆధ్యాత్మికత శోభతో ప్రతి ఏటా ఘనంగా నిర్వహిస్తుండడంతో దేవాలయానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారి దర్శనం చేసుకుంటున్న దృశ్య, తగిన ఏర్పాట్లు చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. దేవాలయం వివిధ పూలతో, విద్యుత్ దీపాలతో అలంకరించనున్నారు. శ్రీ మహాశక్తి దేవాలయంలో జరిగే ఉగాది పర్వదిన వేడుకలకు భక్తులు, హిందూ బంధువులు తరలివచ్చి అమ్మవార్ల కృపకు పాత్రులు కాగలరని ఆలయ నిర్వాహకులు కోరారు.

# మరమ్మతులు చేయరా.. ధర్నాకు దిగాల్సిందేనా..?

## - అధికారులకు తెలంగాణ జాగృతి హెచ్చరిక

**సూర్య తిమ్మాపూర్**

మానకొండూర్, హుజురాబాద్ నియోజకవర్గాలలో రైతులకు ఉపయోగపడే కల్వల ప్రాజెక్ట్ మత్తడి కొట్టుకుపోయి మూడు సంవత్సరాలు కావస్తున్న ఇప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా కనీస మరమ్మత్తులు చెయ్యక పోవడాన్ని నిరసిస్తూ మంగళవారం తెలంగాణ జాగృతి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఎల్ ఎం డి కాలనీలో గల జిల్లా ఇరిగేషన్ కార్యాలయం వద్ద ధర్నా ముట్టడి చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఇరిగేషన్ అధికారలకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కల్వల ప్రాజెక్ట్ మత్తడికి మరమ్మతులు చేయాలని ఈ ప్రభుత్వానికి రైతులన్నా, వ్యవసాయమన్నా పట్టింపు లేదని రైతు వ్యతిరేక విధానాన్ని అవలంబిస్తూ రైతులను మోసం చేస్తుందన్నారు. మానకొండూర్, హుజురాబాద్ నియోజకవర్గాల మధ్యలో రైతులకు సాగునీటి కోసం ఉపయోగకరంగా ఉన్న కల్వల ప్రాజెక్ట్ మత్తడి కొట్టుకుపోయి మూడు సంవత్సరాలు కావస్తున్న నేటికీ దానికి మరమ్మతులు చేయక తాత్సారం చేస్తూ ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టకుండా రైతులను నోళ్లల్లో మట్టి కొడుతుంది. గతంలో ఈ మండలాలకు చెందిన రైతుల, ప్రజల విజ్ఞప్తి మేరకు జనంబాట కార్యక్రమంలో భాగంగా జాగృతి అధ్యక్షురాలు కవిత కల్వల ప్రాజెక్టును



సందర్శించి మరమ్మత్తులు చెయ్యాలని ప్రభుత్వాన్ని కోరడం జరిగింది. రైతుల సమస్యల పై చిత్తశుద్ధితో దృష్టి పెట్టి వీణవంక, శంకరపట్నం మండలాల పరిధిలో అనేక గ్రామాల రైతుల పొలాలకు సాగునీరు అందించేటువంటి కల్వల ప్రాజెక్టు ద్వారా అనేక ఎకరాలలో రైతుల తమ పంటను సాగు చేసుకుంటున్నారని తెలిపారు. ప్రాజెక్ట్ కొట్టుకుపోతే దాన్ని మరమ్మత్తులు చేయించి రైతులకు ఉపయోగంలోకి తీసుకొచ్చే ఆలోచన లేకుండా ఇద్దరు శాసనసభ్యులు కేవలం రాజకీయ పబ్బం గడుపు తున్నారని అన్నారు. వెంటన కల్వల ప్రాజెక్ట్ మరమ్మత్తులు చేసి రైతులను ఆదుకోవాలని తెలిపారు. ప్రాజెక్టు మరమ్మతులను త్వరగా నిర్వహించకపోతే రానున్న రోజులలో ఇరిగేషన్ శాఖ మంత్రి ఇల్లును, రాష్ట్ర ఇరిగేషన్ శాఖ కార్యాలయాన్ని రైతులతో కలిసి ముట్టడిస్తామని జాగృతి జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో తిమ్మాపూర్ మండల జాగృతి నాయకులు బుడిగె పర్శరాములు గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మ్యాకల తిరుపతి, జిల్లా మహిళ విభాగం జిల్లా అధ్యక్షురాలు అంకం శివరాణి, ఆదివాసి విభాగం జిల్లా అధ్యక్షుడు కుతాడి శ్రీనివాస్, బిసి విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రీరాముల రమేష్, జిల్లా సీనియర్ నాయకులు రంగరవేణి లక్ష్మణ్, వారాల శ్రీనివాస్, గాలిపల్లి రత్నాకర్ చారి, బసవేణి రాజేందర్, గాడిచర్ల కొమరయ్య, ఉల్లేందుల నరేష్, అలిశెట్టి అజయ్, గర్షకుర్తి విద్యాసాగర్, మహిళా నాయకురాల్లు తదితరులు ఉన్నారు.

# శాతవాహన ఉర్దూ సహాయ ఆచార్యునికి పేటెంట్

**సూర్య కరీంనగర్**



శాతవాహన విశ్వవిద్యాలయ ఆర్ట్స్ కళాశాల ఉర్దూ సహాయ ఆచార్యులు డా.నజిముద్దీన్ మునవర్ కి పేటెంట్ లభించింది. "వెర్నాక్యులర్ లాంగ్వేజ్ ట్రాన్సలేషన్ డివైస్" అనే అంశంపై పేటెంట్ లభించింది. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య యు.ఉమేష్ కుమార్, డా.మునవర్ను అభినందిస్తూ, ఇతర అధ్యాపకులు కూడా మరిన్ని పరిశో ధనలు చేయాలని విశ్వవిద్యాలయాన్ని ముందుకు తీసుకెళ్లాలని అభినం దనలు తెలియజేశారు. డాక్టర్ నజిముద్దీన్ మునవర్ ఉర్దూ విభాగంలో సహాయ ఆచార్యులుగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన పలు పుస్తకాలతో పాటు, అంతర్జాతీయ సెమినార్లలో, జర్నల్స్ లో తన పరిశోధన పత్రాలు సమర్పించారు. ప్రస్తుతం ఆయన బోర్డు ఆఫ్ స్టడీస్ ఉర్దూ చైర్మన్గా, చీఫ్ వార్డెన్ గా, స్పోర్ట్స్ బోర్డు సెక్రెటరీ గా పనిచేస్తున్నారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య సతీష్ కుమార్, ఓ ఎస్ డి టు వి సి డా. హరికాంత్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డా. పద్మావతి , ఉర్దూ శాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ అబ్రారుల్ బాక్వి, డా. జాఫర్, డా. హుమేరా ఇతర ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు డా. నజిముద్దీన్ మునవర్ నుఅభినందించారు.

# రాజ్యసభ సభ్యులుగా ఎన్నికైన వేం నరేందర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన సుడా చైర్మన్

**సూర్య కరీంనగర్**



ఇటీవల రాజ్యసభ సభ్యులుగా ఎన్నికైన వేం నరేందర్ రెడ్డి ని హైదరాబాద్ లోని వారి నివాసంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే ఏప్రిల్ 2 న కరీంనగర్ లో జరిగే తన కూతురు వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించాలని ఆహ్వాన పత్రిక అందజేసినట్లు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి పేర్కొన్నారు.

# ఉమ్మడి కరీంనగర్ జిల్లా బాక్సింగ్ సెలక్షన్స్‌కు ఆహ్వానం

**సూర్య కరీంనగర్**

ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి అండర్-17 మరియు అండర్-19 బాక్సింగ్ సెలక్షన్స్‌ను మార్చి 18, 2026న ఉదయం 8:30 గంటలకు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా బాక్సింగ్ సంఘం ప్రధాన కార్యదర్శి కొత్తకొండ సంపత్ కుమార్ తెలిపారు. ఈ సెలక్షన్స్‌లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను మార్చి 22, 23, 24 తేదీలలో హైదరాబాద్ షేక్‌పేట్‌లో జరిగే రాష్ట్ర స్థాయి బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లకు ఎంపిక చేస్తారు. 2008, 2009, 2010, 2011 సంవత్సరాల్లో జన్మించిన క్రీడాకారులు ఆధార్ కార్డు, జనన ధృవీకరణ పత్రం (మున్సిపల్ జారీ), రెండు ఫోటోలు మరియు ఎంట్రీ ఫీజు రూ.300తో హాజరుకావాలని సూచించారు. ఇతర వివరాలకు 9100668474 నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

# కరీంనగర్ బస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్

**సూర్య కరీంనగర్**



కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పగిడిమర్రి సోలమన్ డా.బి.ఆర్. అంబేద్కర్ బస్ స్టేషన్‌ను మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. హైదరాబాద్ ప్లాట్‌ఫామ్‌పై ఉన్న సూపర్ లగ్జరీ, ఏసీ బస్సుల్లో డ్రైవర్లు ప్రయాణికులకు స్వాగత సందే శం చదువుతున్నారా లేదా అని పరిశీలించ డంతో పాటు ఏసీ పనితీరును కూడా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డ్రైవర్లతో మాట్లాడి ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని సూచించారు. అలాగే బస్ స్టేషన్ సూపర్వైజర్ రామకృష్ణకు ప్రతి డ్రైవర్ స్వాగత సందేశం తప్పనిసరిగా చదివేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# కలెక్టర్ చిత్రా మిశ్రాను కలిసిన టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ రవీందర్

**సూర్య కరీంనగర్ టౌన్**



కొత్తగా బాధ్యతలు స్వీకరించిన కరీంనగర్ టీజీఎన్‌పీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఆర్. రవీందర్ జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్ఈ రవీందర్‌తో పాటు డి.టెక్నికల్ ఉపేందర్, డి.ఇ (ఆపరేషన్) టౌన్ రాజ్యం, ఎస్ఏఓ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు భూసార ఆధారిత సాగు పద్ధతులపై అవగాహన

**సూర్య కోనరావుపేట**

కోనరావుపేట మండలంలోని బావుసాయిపేట రైతు వేదికలో అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్మెంట్ ఏజెన్సీ (ఆత్మ) ఆధ్వర్యంలో రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ షేక్ యాస్మిన్ పాషా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో భూసార పరీక్షల ప్రాముఖ్యత, ఫలితాల ఆధారంగా ఎరువుల వినియోగం, ఆయిల్ పామ్ సాగు, ప్రకృతి వ్యవసాయం, కూరగాయల సాగు విధానాలపై నిపుణులు వివరించారు. ఈ సందర్భంగా రైతులకు భూసార పరీక్ష కార్డులు అందజేసి, ప్రకృతి వ్యవసాయ కిట్లను పంపిణీ చేశారు. రైతులు భూసార



నివేదికలను అనుసరించి పంటల సాగు చేపడితే ఖర్చులు తగ్గి దిగుబడులు పెరుగుతాయని అధికారులు సూచించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య హాజరై రైతులు శాస్త్రీయ పద్ధతులు అవలంబించాలని కోరారు. మామిడిపల్లి సర్పంచ్ పన్నాల లక్ష్మారెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ మల్లారెడ్డి, మండల వ్యవసాయ అధికారి దుర్గరాజు, రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొని రైతులకు మార్గనిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఏఈఓలు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, మామిడిపల్లి సర్పంచ్ పన్నాల లక్ష్మారెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ మల్లారెడ్డి, మండల వ్యవసాయ అధికారి దుర్గరాజు, రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రాజేంద్ర ప్రసాద్, స్థానిక ఏఈఓలు, ప్రజాప్రతినిధులు, రైతు సోదరులు పాల్గొన్నారు.

## గౌడ సంక్షేమానికి అందరూ ఐక్యంగా కృషి చేయాలి.

**- నాగుల సత్యనారాయణ గౌడ్**

**సూర్య సిరిసిల్ల టౌన్**



జిల్లా కేంద్రంలో గౌడ సంక్షేమ సంఘం భవన నిర్మాణానికి గౌడ కులస్తులు అందరూ ఐక్యంగా కృషి చేయాలని జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్ అన్నారు.ఇటీవలే ఎన్నికైన గౌడ కౌన్సిలర్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు.సిరిసిల్ల గౌడ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని శ్రీ రేణుకా దేవి ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో నూతనంగా ఎన్నికైన గౌడ సామాజికవర్గ కౌన్సిలర్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కౌన్సిలర్లు బుర్ర నారాయణ గౌడ్,బోల్గాం వైష్ణవి నాగరాజు గౌడ్,బుర్ర మల్లికార్జున్ గౌడ్ లను ఘనంగా సన్మానించారు. అనంతరం సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో గౌడ సంఘంకు కేటాయించిన రెండు ఎకరాల స్థలంలో భవనం నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.పార్టీలకు అతీతంగా కుల బలాన్ని పెంచేందుకు కృషి చేయాలని పిలుపు నిచ్చారు.ప్రతి ఒక్కరు ఐక్యంగా ఉండి మనకు రావాల్సిన పదవులను సంపాదించుకోవాలని, ఐక్యత లేకుంటే గౌడ కులస్తుల మనుగడే ప్రశ్నార్థకం అవుతుందని అన్నారు.గౌడ సంఘం సభ్యులు అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ గౌడ హాస్టల్ ఉపాధ్యక్షుడు పరకాల లక్ష్మణ్ గౌడ్,జిల్లా గౌడ సంఘం ప్రధాన కార్యదర్శి బుర్ర నారాయణ గౌడ్,గీతా కార్మిక సంఘాల ప్రతినిధులు బండారి శ్రీనివాస్ గౌడ్, బాలసాని అంజయ్య గౌడ్,పరకాల అంజయ్య గౌడ్,బుర్ర కిషోర్ గౌడ్,గుగ్గిల జగన్ గౌడ్,చెక్కిళ్ల మహేష్ గౌడ్,డాక్టర్ యాదగిరి గౌడ్, నేరెళ్ల వంశీకృష్ణ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు,వేసవి నీటి సమస్యలు జాతర ఏర్పాట్లపై పెద్దాపూర్ గ్రామసభలో చర్చ

**సూర్య జూలపల్లి:**

మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో సర్పంచ్ తొగరు శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక గ్రామపంచాయితీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ కార్యదర్శి గ్రామపంచాయితీ ఆదాయం, వ్యయాల వివరాలను ప్రజలకు వెల్లడించారు.వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామంలో నీటి కొరత తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. శ్రీ యోగానంద లక్ష్మి నరసింహాస్వామి జాతర సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చేయాల్సిన ఏర్పాట్లపై నిర్ణయాలు తీసుకున్నారు. గ్రామ అభివృద్ధి పనులపై ప్రజల సూచనలు స్వీకరించి వాటిపై చర్చించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జెల్ల కనకయ్య,వార్డు సభ్యులు నల్లల లావణ్య, తీగల అశోక్,పెసరు లచ్చయ్య, భైర మల్లమ్మ, షాహీన్,సంకెండ్ల శోభ, కళ్లెపెల్లి పోచాలు,కళ్లెపెల్లి స్వామి,కళ్లెపెల్లి మహేందర్, కార్యదర్శి తీగల సతీష్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ శివప్రసాద్, సీసీ రాధ, ఏఎన్ఎం,అంగన్వాడీ సిబ్బంది,ఆశా వర్కర్లు,గ్రామస్తులు పాల్గొన్నారు.



## ప్రత్యేక వైద్య శిబిరానికి విశేష స్పందన

**సూర్య, సెంటినరీ కాలనీ**



రామగిరి మండలం బేగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సర్పంచ్ మంథని చంటి ఈ శిబిరం ను ప్రారంభించారు. వివిధ రంగాలకు చెందిన నిపుణులైన వైద్యులు ప్రజలకు ఉచిత వైద్య సేవలను అందించారు. ఈ శిబిరంలో ముఖ్యంగా గైనకాలజిస్ట్, పిల్లల వైద్య నిపుణులు (పెడియాట్రిక్స్), కంటి వైద్యులు (ఒప్తాల్మాలజిస్ట్), ఎముకల వైద్యులు (ఆర్థోపెడిక్), దంత వైద్యులు (డెంటల్), అలాగే జనరల్ మెడిసిన్ వైద్యులు సేవలు అందించారు. గ్రామ ప్రజలు తమ ఆరోగ్య సమస్యలను నిపుణులైన వైద్యులకు తెలియచేసారు. ప్రజలు ఎక్కువ సంఖ్యలో హాజరై ఈ ప్రత్యేక వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బేగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఇల్లటం ప్రదీప్, ఉప సర్పంచ్ సందేల రేణుక-కుమార్ పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**- అధికార ప్రతినిధి అరవింద్ రావు**

**సూర్య, సెంటినరీ కాలనీ**



ప్రతి ఒక్కరు ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికార ప్రతినిధి అరవింద్ రావు అన్నారు. ఆర్జీ-2 డివిజన్ పరిధి 8వ కాలనీలోని సిఈఆర్ క్లబ్ లో ఈ నెల 20వ తేదీన ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 01:00 గంటల వరకు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించబడుతుందని అధికార ప్రతినిధి అరవింద్ రావు ( ఏజీఎం పర్సనల్) ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆయుర్వేద వైద్యులు విశ్వనాథ మహర్షిచే వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, దీర్ఘకాలిక వ్యాధులు బీపీ, షుగర్, కీళ్ల నొప్పులు, నడుము నొప్పులు, అస్తమా, చర్మ వ్యాధులు మొదలైన వాటికి పరీక్షలు చేసి మందులు ఇవ్వడం జరుగుతుందని, అరుదైన ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## రైతులకు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

**సూర్య, సెంటినరీ కాలనీ**

కమాన్ పూర్ మండలం గుండారంలోని రైతు వేదిక లో జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ లో భాగంగా కమాన్పూర్ మండలం సిద్ధిపల్లి రైతులకు, రామగిరి మండలం కల్వచర్లకు చెందిన రైతులకు దృశ్య శ్రవణ మాధ్యమం ద్వారా ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ఇచ్చారు. ఈ దృశ్య శ్రవణ మార్గం మాధ్యమంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులకు ప్రకృతి వ్యవసాయం యొక్క ప్రాముఖ్యత మరియు ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతుల యొక్క అనుభవాలు అందరికీ వివరించారు. శిక్షణ కార్యక్రమానికి వచ్చిన కలవచర్ల రైతులకు సర్పంచ్ రేండ్ల శారదకుమారస్వామి కిట్టు బ్యాగులను అందచేశారు. ఈ కార్యక్రమంలో కలవచర్ల సర్పంచ్ రేండ్ల శారదకుమారస్వామి, సిద్ధిపల్లి సర్పంచ్ బంగారు మహేష్, కమాన్ పూర్ మండల వ్యవసాయ అధికారి గిరి రామకృష్ణ, రామగిరి మండల వ్యవసాయ అధికారి చిందం శ్రీకాంత్, వ్యవసాయ విస్తరణ అధికారులు అరవింద్,అనూష మరియు రైతులు పాల్గొన్నారు.





## ఆశ వర్కర్లకు కనీస వేతనం అమలు చేయాలంటూ ధర్నా

**సూర్య సిరిసిల్ల టౌన్**

అసెంబ్లీ బడ్జెట్ సమావేశంలో ప్రభుత్వం ఆశా కార్యకర్తలకు కనీస వేతనం 26 వేలు ప్రకటించాలనీ సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ముశం రమేష్ డిమాండ్ చేశారు.ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు.జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద ఆశా వర్కర్లు కనీస వేతనం 26 వేలు ప్రకటించాలని,ప్రభుత్వ ఉద్యోగులుగా,ప్రమాద బీమా 50 లక్షలు,పెండింగ్ జీతాలు,లెప్రసీ సర్వే రద్దు,తదితర డిమాండ్లతో పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా వర్కర్లు అతి తక్కువ వేతనంతో 24 గంటలు పని చేయడం జరుగుతుందని,వారికి సంబంధం లేని పని కూడా ప్రభుత్వం చేయించుకుంటూ శ్రమ దోపిడీకి గురిచేస్తుందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఆశాలకు 18 డిమాండ్లను అమలు చేస్తామని,ప్రభుత్వ ఉద్యోగులుగా నియమిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని,ఇంతవరకు హామీలు అమలు చేయకుండా పని భారం విపరీతంగా పెంచారని ఆరోపించారు.బడ్జెట్ సమావేశంలో ఆశాల డిమాండ్ పరిష్కరించని ఎడల నిరవధికా సమ్మెకు వెళ్లడానికి ఆశాలు సిద్ధంగా ఉన్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎగమంటి ఎల్లారెడ్డి,సిఐటియు జిల్లా నాయకులు ఎలిగేటి రాజశేఖర్,ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఆడే రజిత,ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జయశీల,జిల్లా గౌరవ అధ్యక్షులు భారతి,మండల అధ్యక్షులు రాణి,గాయత్రి, జమున,లతా,కన్నం లత,లక్ష్మి,సునంద,సందుపట్ల పోచమల్లు పాల్గొన్నారు.

## ఆయిల్ కొరత పై సిపిఐ వినూత్న నిరసన...

**సూర్య - పెద్దపల్లి రూరల్**



పెద్దపల్లి మండలం పెద్ద కలవల గ్రామంలోని మహబూబా బాగ్ వద్ద గల రిలాక్స్ కేఫ్ లో సిపిఐ పెద్దపల్లి జిల్లా కౌన్సిల్ సభ్యులు బాలసాని లెనిన్ ఆధ్వర్యంలో గ్యాస్ మరియు ఆయిల్ కొరత కారణంగా కట్టెలు ఇచ్చి చాయ్ ఇవ్వాలని వినూత్న నిరసన చేశారు . ఈ సందర్భంగా లెనిన్ మాట్లాడుతూ కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల మరియు కేటాయించకపోవడం వలన హోటల్ రెస్టారెంట్లలో సిలిండర్ లేవని దీని వలన వాళ్ళు హోటల్స్ మూసుకోవాల్సి వస్తుందని అన్నారు . ఇది యుద్ధం తెచ్చిన కొరతన లేక బడా వ్యాపారులు తమ వ్యాపారాన్ని కొనసాగించుకోవడానికి చేస్తున్నటువంటి కృత్రిమ కొరత నా అని ప్రభుత్వం ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి నవీన్, సిపిఐ నాయకులు కనుకుంట్ల సుమన్, సాయిరాం, ఆజాద్, కలవల స్టాలిన్, బొబ్బిలి రాకేష్, మహేందర్ పాల్గొన్నారు.

## చెరువుల్లో నీరు నింపాలి.

**- ఇరిగేషన్ ఈఈకి వినతిపత్రం అందజేసిన రైతులు**

**సూర్య కోనరావుపేట**



కోనరావుపేట మండలంలోని నిజామాబాద్ గ్రామంలో చెరువులకు సాగునీరు అందించాలంటూ యువ రైతు అధికారులను ఆశ్రయించాడు. మల్కపేట ప్రాజెక్టు ప్యాకేజ్-9లో భాగంగా గ్రామల్లో ఉన్న చెరువులను నింపేందుకు ప్రభుత్వం చేపట్టిన పనుల కోసం రైతులు భూములు ఇచ్చినప్పటికీ, ఇప్పటివరకు నీరు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు.గ్రామానికి చెందిన యువ రైతు దుర్గం మహేష్ ఇరిగేషన్ ఈఈ కిషోర్ కుమార్‌కి వినతిపత్రం సమర్పించి, చెరువులను తక్షణమే నింపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రాజెక్టు పనుల సమయంలో చెరువులు నింపబడతాయని హామీ ఇచ్చినప్పటికీ, అది అమలు కాలేదని తెలిపారు.సాగునీరు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పంటలు సాగు చేయడం కష్టమై ఆర్థికంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఇరిగేషన్ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసి చెరువులకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## సేంద్రీయ వ్యవసాయం పై అవగాహన సదస్సు.

**సూర్య సారంగాపూర్**



వ్యవసాయంలో సేంద్రీయ పద్ధతిలో సాగు విధానం గురించి రైతులకు అవగాహన కల్పించినట్లు మండల వ్యవసాయ విస్తీరణ అధికారి సృజన తెలిపారు.వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డ్రోన్ మరియు సేంద్రియ వ్యవసాయం మీద రైతులకు అవగహన కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు తోడేటి శ్రీనివాస్ గౌడ్,ఆకుల రాజారెడ్డి, గంగాధర్ గౌడ్, పిన్నెం సత్యం, రైతులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలోనే బాలల వివాహ రహిత గ్రామంగా బ్రాహ్మణపల్లి

### - బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు చందన

**సూర్య - పెద్దపల్లి రూరల్**

రాష్ట్రంలోనే బాలల వివాహ రహిత గ్రామంగా బ్రాహ్మణపల్లి నిలిచిందని తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు ఎం.చందన అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల కార్యక్రమం ప్రగతి ప్రణాళికలో భాగంగా పెద్దపల్లి మండలం బ్రాహ్మణపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో జిల్లా సంక్షేమ అధికారి పి. వేణు గోపాల్ ఆద్వర్యంలో మంగళవారం బాలల హక్కుల పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు ఎం. చందన మాట్లాడుతూ చదువుతోనే మహిళా వికాసం సాధ్యమని అన్నారు. బాల్య వివాహాల నిరోధానికి ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు. బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు అనేకమని, బాలల హక్కుల పరిరక్షణ కోసం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. ప్రజలంతా ఐక్యతతో ఉంటే అనుకున్నది సాధించవచ్చన్నారు. తరతరాల నుండి



బాల్య వివాహాల సమస్య ఉందని, దానిని రూపుమాపేందుకు అందరూ కృషి చేయాలని సూచించారు. శారీరక ఎదుగుదల, కని పెంచే శక్తి ఉంటేనే వివాహాలు నిలబడుతాయని, తప్పనిసరిగా చట్టాలకు లోబడి వివాహాలు జరిపించాలని కోరారు. బాల్య వివాహాల నిరోధానికి కేంద్రం మార్గదర్శకాలు జారీ చేసిందని, వాటిపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. విద్య ద్వారా సమాజంలో మార్పు వస్తుందని, టెక్నాలజి మానవ జీవితంలో పెను మార్పులు సృష్టించిందని అభిప్రాయపడ్డారు. కుటుంబ వ్యవస్థ బలహీన పడే స్థితిలో ఉన్న నేపథ్యంలో బాధ్యతలను గుర్తించాలని, తద్వారా కుటుంబ బంధాలు, అనుబంధాలు పెంచుకోవాలని పేర్కొన్నారు. పిల్లలు భవిష్యత్ కు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు. గ్రామాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. పిల్లలను సరియైన పద్ధతిలో నడిపించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనన్నారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈసందర్భంగా బాల్య వివాహాల రహిత గ్రామంగా ఎంపిక చేస్తూ ధృవీకరణ పత్రం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మేకల రోజారాణి, అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి రవీందర్, సిడిపిఓలు కవిత, పుష్పలత, ఎంపిడిఓ శ్రీనివాస్, ఎంఈఓ సురేందర్ కుమార్, పంచాయితీ కార్యదర్శి ఝాన్సీ, ఐసిడిఎస్, చైల్డ్ వెల్ఫేర్ అధికారులు, సిబ్బంది, వార్డు సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.



## వందేమాతరాన్ని అవమానించిన ఎమ్మెల్యేలను బర్తరఫ్ చేయాలి

### - బిజెపినేత బెజ్జంకి దిలీప్ కుమార్ ఆగ్రహం

**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**



తెలంగాణ అసెంబ్లీలో వందేమాతర గీతాలాపన సందర్భంగా ఎంఐఎం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ప్రవర్తించిన తీరు గర్హనీయమని భారతీయ జనతా పార్టీ సీనియర్ నేత బెజ్జంకి దిలీప్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దిలీప్ మాట్లాడుతూ వందేమాతర గీతం ఆలపించడానికి ముందే అసెంబ్లీ నుండి ఎంఐఎం ప్రతినిధులు బయటికి వెళ్ళిపోవడం జాతీయ గీతాన్ని అవమానపరచడమేనని అన్నారు. అధికారిక కార్యక్రమంలో వందేమాతర గేయాన్ని విధిగా ఆల్పించాల్సిదిగా కేంద్రప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసిన నేపథ్యంలో వందేమాతర గేయాన్ని ఎంఐఎం ప్రజాప్రతినిధులు అవమానించడం వారి వికృత మనస్థత్వానికి, దేశధిక్కార ధోరణికి పరాకాష్టగా పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెసు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎంఐఎం గుండా రాజ్యం నడిపిస్తోందని ఆక్షేపించారు. హిందూ దేవాలయాలపై దాడులు వారి పైశాచిక తీరుకు అద్దం పడుతోందన్నారు. రాష్ట్రంలో ఎవరు అధికారంలోకి వచ్చినా తమ బూటు నాకాల్సిందేనంటూ అహంకార దృక్పథాన్ని చూపెట్టిన ఓవైసీ సోదరుల మాటలకు అడుగులో మడుగులు ఒత్తుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి త్వరలో తెలంగాణ ప్రజలు బుద్ధి చెపుతారని, రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వం వచ్చాక ఎంఐఎం గుండాగిరికి చరమగీతం పాడతామని, అసెంబ్లీ స్పీకర్ సాక్షిగా వందేమాతర గీతాన్ని అవమానించిన ఎంఐఎం ప్రజాప్రతినిధుల సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బిజెపి నాయకులు కాసనగొట్టు విజయ్, భూతగడ్డ రాజకుమార్, మణిదీప్, రాకేష్, కలువల నాగరాజు, గుమ్మడి చందు, రాజకుమార్, భూతగడ్డ శివ, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణిలో కార్మికుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించండి

### - లేకుంటే సమ్మె తప్పదు -ఏఐటియుసి నాయకుల హెచ్చరిక

**సూర్య-గోదావరిఖని**

సింగరేణి కార్మికుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని,లేదంటే సమ్మెకు దిగుతామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) నాయకులు హెచ్చరించారు.మంగళవారం సింగరేణి ఆర్జీ-1 ఏరియాలోని బొగ్గు గనులు, విభాగాలు, ఓసీపీ-5 ప్రాంతాల్లో ధర్నాలు నిర్వహించి, డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను ఆయా గనుల అధికారులకు సమర్పించారు.ఈ సందర్భంగా యూనియన్ ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, బ్రాంచి సహాయ కార్యదర్శి రంగు శ్రీను మాట్లాడుతూ సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.51 వేల కోట్ల బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే కొత్త గనులు కేటాయించాలని, ఏసీబీ విచారణ పేరుతో నిలిపివేసిన మెడికల్ బోర్డు



సమావేశాలను వెంటనే నిర్వహించాలని కోరారు. అదేవిధంగా కార్మికులకు సొంత ఇంటి పథకం అమలు చేయాలని, పెర్క్స్‌పై ఇన్‌కమ్ ట్యాక్స్‌ను యాజమాన్యమే భరించాలని, విజిలెన్స్ కేసులు, మారుపేర్ల కారణంగా ఉద్యోగాలు కోల్పోయిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. డిస్మిస్ అయిన కార్మికులకు ఒకసారి అవకాశం ఇవ్వాలని కూడా వారు సూచించారు. సింగరేణిలో రాజకీయ జోక్యం విపరీతంగా పెరిగిపోతోందని, దీనిని అరికట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, యాజమాన్యం కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్నాయని వారు విమర్శించారు. ఈ నేపథ్యంలో ఈ నెల 18 నుంచి 30 వరకు "సేవ్ సింగరేణి" పేరుతో గోలేటి నుంచి కొత్తగూడెం వరకు పోరుజాత నిర్వహించి హెడ్ ఆఫీస్‌ను ముట్టడించనున్నట్లు ప్రకటించారు. ఇందులో భాగంగా ఈ నెల 22న గోదావరిఖనికి పోరుజాత చేరుకుని, గోదావరి బ్రిడ్జి నుంచి చౌరస్తా వరకు మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించి కార్నర్ మీటింగ్ చేపడతామని తెలిపారు.ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చిన నాయకులు, సమస్యలు పరిష్కరించకపోతే ఏప్రిల్‌లో సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఇంకా ఈ కార్యక్రమాల్లో ఏఐటియుసి ఆర్జీ-1 బ్రాంచి నాయకులు, ఫిట్ కార్యదర్శులు మరియు పలువురు కార్మికులు పాల్గొన్నారు.

## మున్సిపల్ చైర్మన్‌కు శ్రీరామనవమి శోభాయాత్ర ఆహ్వానం

**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**



ఈ నెల 27వ తేదీన శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకొని హిందూవాహిని ఆధ్వర్యంలో నిర్వహించనున్న శ్రీరామనవమి శోభాయాత్రకు పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్యను ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో హిందూవాహిని ప్రతినిధులు ఆయనను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరం చైర్మన్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో హిందూవాహిని పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షులు ఉయ్యాంకార్ సాయి కుమార్, ప్రతినిధులు పూసాల శ్యాంసుందర్, పశులేటి వెంకటసాయి, బండి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో నిర్వహించే శోభాయాత్రను విజయవంతం చేయాలని కోరారు.

## హోటళ్లలో తనిఖీలు సిలిండర్ల సీజ్

**సూర్య సుల్తానాబాద్**



సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని పలు హోటల్లో సివిల్ సప్లయి అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు.హోటళ్లలో ఆకస్మిక తనిఖీలు చేయగా గృహ గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న 8 సిలిండర్లను సీజ్ చేసి 5 హోటళ్లపై కేసులు నమోదు చేశారు.

## జిల్లా ప్రధాన న్యాయమూర్తిని మర్యాదపూర్వకంగా కలిసిన మున్సిపల్ చైర్మన్

**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**



పెద్దపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాలను పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కోర్టు కార్యాలయంలో ఆమెను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా జిల్లాలో జరుగుతున్న పలు సామాజిక అంశాలు, మున్సిపాలిటీ పరిధిలోని విశేషాల గురించి వారు చర్చించారు. పట్టణ అభివృద్ధిలో మున్సిపల్ కౌన్సిల్ తీసుకుంటున్న చర్యలను, ప్రజలకు అందిస్తున్న సేవలను ఈ సందర్భంగా చైర్మన్ ప్రస్తావించారు. న్యాయ వ్యవస్థ, స్థానిక సంస్థల సమన్వయంతో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేలా తమ సహకారం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో చైర్మన్ వెంట పెద్దపల్లి మున్సిపాలిటీ 3వ వార్డ్ కౌన్సిలర్ మోలుగురి కమల్, ఏజీపీ (AGP) ఉప్పు రాజు ఉన్నారు.

## అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్ సిజ్

**సూర్య - ఎలిగేడు**



మండలంలోని సుల్తాన్ పూర్ గ్రామం నుండి చెరువు మట్టిని అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకొని మైనింగ్ డిపార్ట్మెంట్‌కు రెఫర్ చేసినట్లు ఎస్ఐ మధుకర్ తెలిపారు.టిప్పర్ ద్వారా ఎదురుగట్టలో నిలువ చేసిన నల్ల మట్టిని ఎలాంటి అనుమతులు లేకుండ అక్రమంగా తరలించే క్రమంలో గ్రామస్థుల సమాచారం మేరకు వెళ్లి టిప్పర్‌ను సిజ్ చేసి పోలీస్ స్టేషన్ తరలించామన్నారు. ఉన్నతధికారుల ఆదేశాల మేరకు టిప్పర్ ఓనర్, డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## కార్మికులకు, ప్రజలకు స్పెషల్ ఆఫర్ "మెగా" దుమ్ము

**సూర్య, సెంటినరీ కాలనీ**



సెంటినరీ కాలనీ ప్రాంత వాసులకు మెగా కంపెనీ దుమ్ము శాపంగా మారింది. నేషనల్ హైవే రోడ్డు కొరకు ఓసీపీ-1 డంప్ యార్డ్ నుండి జిఎం కార్యాలయం పన్నూర్ క్రాస్ రోడ్డు మీదుగా హైవే రోడ్డుకు ప్రతి రోజు ఓబీని తరలిస్తున్నాయి. భారీగా దుమ్ము చెలరేగడంతో కార్మికులు రోగాల బారిన పడే అవకాశం ఉన్న యాజమాన్యం పట్టించుకోవడం లేదు.

- పివీరావు,
- సెంటినరీ కాలనీ

# పూత ఘనంగా... పిందెలు స్వల్పం.. నష్టాల్లో మామిడి రైతులు

**సూర్య మల్యాల:**
పూత నిలుపుదల కోసం రైతులు మూడు నుంచి



ఆరు సార్లు వరకు మందులు పిచికారి చేసినప్పటికీ ఆశించిన ఫలితం కనిపించలేదు. దీంతో పెట్టుబడిగా లక్షల రూపాయలు ఖర్చు చేసిన రైతులు, కౌలు రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. ఇంకా హార్టికల్చర్ అధికారులు మాత్రం గ్రామాల్లో పర్యటించకపోవడం రైతుల్లో ఆందోళన కలిగిస్తోంది. సమస్యపై తక్షణమే స్పందించి గ్రామాల వారీగా సర్వే నిర్వహించి రైతులను ఆదుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

**ప్రభుత్వం ఆదుకోవాలి: కౌలు రైతు అశోక్**
మ్యాడంపల్లి గ్రామానికి చెందిన కౌలు రైతు చీకట్ల అశోక్ మాట్లాడుతూ, "20 ఎకరాల మామిడి తోటను కౌలుకు తీసుకుని ఆరు సార్లు మందులు పిచికారి చేశాను. అయినా పూత నిలవడం లేదు. ఈసారి ఆదాయం లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నాను. ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి" అని విజ్ఞప్తి చేస్తున్నారు.

# రీల్స్ జోడీ మధ్య రియల్ విషాదం




**(మొదటి పేజి తరువాయి)**
అందరూ మురిసిపోయేవారు.

**- అసలేం జరిగింది?.....**




వైష్ణవి ప్రస్తుతం ఐదు నెలల గర్భవతి. భార్యను ఆసుపత్రికి తీసుకెళ్తూ, ఆమెపై ఎంతో ప్రేమ చూపిస్తున్నట్లు హరిబాబు వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేసేవాడు. అయితే, ఈ రంగుల ప్రపంచం వెనుక గృహ హింస దాగి ఉంది. రెండు రోజుల క్రితం హరిబాబు తల్లి దగ్గరకు వెళ్లిన సమయంలో, ఆమె వైష్ణవి కళ్లలో కారం చల్లి గొడవ పడినట్లు తెలుస్తోంది. సోమవారం రాత్రి ఇదే విషయంలో భార్యాభర్తల మధ్య తీవ్రస్థాయిలో ఘర్షణ జరిగింది. ఆగ్రహంతో ఊగిపోయిన హరిబాబు, కత్తితో వైష్ణవిపై విచక్షణారహితంగా దాడి చేశాడు. ఆమె కేకలు విన్న చుట్టుపక్కల వారు.. అది మామూలు గొడవేనని భావించి పట్టించుకోలేదు.

**- వెలుగులోకి వచ్చిన ఘోరం**
మంగళవారం ఉదయం హరిబాబు మామూలుగానే రెడీ అయి బయటకు వెళ్లిపోయాడు. చాలా సేపటి వరకు తన కూతురు బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన తల్లి లోపలికి వెళ్లి చూడగా, వైష్ణవి రక్తపు మడుగులో ప్రాణాలు విడిచి పడి ఉంది. ఈ దృశ్యం చూసి కుటుంబ సభ్యులు తల్లడిల్లిపోయారు. హత్య అనంతరం హరిబాబు పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు సమాచారం.

**- ఈ ఘటనపై మెట్పల్లి డీఎస్పీ స్పందిస్తూ..**
ప్రేమ వివాహం చేసుకున్నప్పటికీ, అదనపు కట్నం తేవాలని హరిబాబు కుటుంబ సభ్యులు వైష్ణవిని వేధిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో తేలిందని పేర్కొన్నారు. ఈ వేధింపుల వల్లే హత్య జరిగి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ హత్య వెనుక హరిబాబు ఒక్కడే ఉన్నాడా లేక ఇతరుల ప్రోద్బలం ఏమైనా ఉందా అనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. మృతురాలి బంధువులు తమకు న్యాయం చేయాలని కన్నీరుమున్నీరుగా విలపించటం పలువురిని కంటతడి పెట్టించింది.

# ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు

**- 99 రోజుల ప్రణాళికలో రోడ్డు భద్రతకు ప్రాధాన్యం - సమన్వయంతో ప్రమాదాల నివారణ**

**- జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**
వివిధ శాఖల అధికారులు సమన్వయంతో రోడ్డు భద్రతా చర్యలు తీసుకుంటూ ప్రమాదాలు నివారించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పేర్కొన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ ప్రమాదాలు జరిగే చోట్లను గుర్తించి నివారణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరంలో, రహదారుల్లో రోడ్లు, డ్రైనేజీలు మరమ్మతులు సమయంలో వాహనదారులు గుర్తించేలా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కొన్ని పనులు దీర్ఘకాలం పాటు జరిగే అవకాశం ఉన్నందున అక్కడ వాహన ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రమాదాల్లో




బాధితులకు తక్షణ వైద్య సాయం అందేలా ఆసుపత్రులకు ఆదేశాలు జారీ చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. ప్రజాపాలన 99 రోజుల కార్యక్రమంలో భాగంగా అరైవ్-అలైవ్ పేరుతో రోడ్డు భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. అందువల్ల అధికారులు రోడ్డు భద్రతపై దృష్టి పెట్టాలని అన్నారు. ప్రమాదకర మలుపులు, సిగ్నలింగ్ పై దృష్టి సారించాలని , రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ జిల్లాలో 24 ప్రమాదాలు ఎక్కువగా జరిగే చోట్లు ఉన్నాయని తెలిపారు. హెచ్చరిక బోర్డులు, రోడ్డు వైపు పెరిగిన కొమ్మలు కత్తిరించడం తదితర చర్యల ద్వారా ప్రమాదాలు నివారించాలని సూచించారు. నగరంలో బ్లికింగ్ బల్బులు, జంక్షన్లలో సిగ్నలింగ్, లైటింగ్ వ్యవస్థ కు సంబంధించి పలు సూచనలు చేశారు. జగిత్యాల రోడ్డుకు ఇరు ప్రక్కల పొదలు, కొమ్మలను తొలగించడం ద్వారా ప్రమాదాలను నివారించగలమని తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్, ఆర్టిఏ కమిటీ మెంబర్ పడాల రాహుల్, రోడ్లు భవనాల శాఖ ఈఈ నరసింహాచారి తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు








**సూర్య కరీంనగర్**
కరీంనగర్ రూరల్ పోలీసుల గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా సుల్తానాబాద్ మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన బొంకూరి నరేష్ అనున్నతడు ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తన ట్రాక్టర్ నందు రవాణా చేస్తుండగా తీగలగుట్టపల్లి లోని రైల్వే గేట్ వద్ద కరీంనగర్ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. రేకుర్తి గ్రామానికి చెందిన పర్వతం శ్రీకాంత్, అతని యజమాని నూనె సారయ్య అనువారు తమ యొక్క అశోక్ లేలాండ్ గూడ్స్ క్యారియర్ వాహనంలో అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా మొగ్దుంపూర్ గ్రామం వద్ద కరీంనగర్ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. చేగుర్తి గ్రామానికి చెందిన ఎలుకపెల్లి నవీన్ అనునతడు తన ట్రాక్టర్ నందు అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా బొమ్మకల్ లోని ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద పోలీసులు పట్టుకున్నారు నిందితుల యొక్క వాహనాలు సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేసి తదుపరి చర్య నిమిత్తం కోర్టుకు పంపించడమైనది. అక్రమ ఇసుక రవాణా చేసే వారిపై సస్పెక్ట్ షీట్లు తెరిచి సీజ్ చేసిన వాహనాలను కోర్టు ద్వారా వేలం వేయడం గురించి ప్రభుత్వానికి అప్ప చెప్పడం అయినది అని కరీంనగర్ రూరల్ సీఐ ఏ నిరంజన్ రెడ్డి తెలిపారు.

# కెమెరాకు చిక్కిన పెద్దపులి...

**(మొదటి పేజి తరువాయి)**
గుర్తించామని తెలిపారు. మహారాష్ట్ర సరిహద్దులోని జన్నారం ప్రాంతం నుంచి వచ్చిన ఈ పెద్దపులి ప్రస్తుతం కొడిమ్యాల రేంజ్ పరిధిలో సంచరిస్తోందని ఆయన వెల్లడించారు. ఇప్పటికే రెండు పశువులను చంపినట్లు గుర్తించామని, ప్రస్తుతం ఇదే ప్రాంతంలో తిరుగుతున్నట్లు సమాచారం ఉందన్నారు. పులిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామని, దాన్ని సురక్షితంగా పట్టుకుని అనుకూలమైన అటవీ ప్రాంతంలో వదిలిపెడతామని తెలిపారు. ఈ సందర్భంగా రైతులు, గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పులిని ఎక్కడైనా గమనించినా దానిని చంపడానికి ప్రయత్నించకూడదని, కరెంట్ తీగలు వేయడం, పొలాల్లో విషపదార్థాలు లేదా ఇతర మందులు పిచికారీ చేయడం వంటి చర్యలు చేపట్టకూడదని డీఎఫ్ఓ కోరారు.

# అసంపూర్తిగా మన ఊరు - మనబడి పనులు

**(మొదటి పేజి తరువాయి)**
నిర్మించాడు. ఇంతలో ప్రభుత్వం మారడంతో పాత పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడం, అసంపూర్తి నిర్మాణాన్ని పూర్తి చేయడానికి బిల్స్ ప్రభుత్వం ఇవ్వకపోవడంతో కాంట్రాక్టర్ చేతులెత్తేశాడు. దాంతో రెండు సంవత్సరాలుగా కిచెన్ షెడ్, డైనింగ్ హాల్ నిర్మాణం పూర్తి కాకుండా వృధాగా ఉంది. అసంపూర్తిగా ఉన్న డైనింగ్ హాల్ వల్ల రోజూ వంట చేసే నిర్వాహకులు చెట్ల కింద వండుతూ ఇబ్బంది పడుతున్నారు. పిల్లలు సైతం భోజనాలు చేయడానికి వేరే వేరే గదుల వద్దకు వెళ్లాల్సి వస్తుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిధులు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

# శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో భారీ చోరీ

**- భద్రత సున్నా.. దోపిడీయే లక్ష్యం**

**సూర్య, తిమ్మాపూర్**



తిమ్మాపూర్ మండలంలోని ఎల్ఎండి కాలనీ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో భారీ చోరీ జరిగింది. సోమవారం రాత్రి దుండగులు ఆలయ తాళాలు పగలగొట్టి, సుమారు రూ. 10 లక్షల విలువైన ఆభరణాలను అపహరించారు. మంగళవారం ఉదయం అర్చకులు ఈ విషయాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. క్లూస్ టీంతో రంగంలోకి దిగిన పోలీసులు వేలిముద్రలు సేకరించి దర్యాప్తు ప్రారంభించారు. అయితే, గతంలోనూ పలుమార్లు దొంగతనానికి ప్రయత్నాలు జరిగినప్పటికీ, ఆలయ కమిటీ సీసీ కెమెరాలు వంటి కనీస భద్రతా చర్యలు తీసుకోకపోవడంపై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లక్షల ఖర్చుతో బ్రహ్మోత్సవాలు నిర్వహించిన కమిటీ, భద్రతను విస్మరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# నగర అభివృద్ధికి నిధులు కేటాయించండి

**- సుడా చైర్మన్ ను కలిసిన కార్పొరేటర్లు**

**- సానుకూలంగా స్పందించిన సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి**

**సూర్య కరీంనగర్**
డివిజన్లలో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని పలువురు కార్పొరేటర్లు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ని కలిసి కోరారు. కొన్ని ప్రాంతాల్లో అత్యవసరంగా పనులు చేయాల్సిన అవసరం ఉందని ప్రజలు రోడ్లు డ్రైనేజీలు లేక పాతవి దెబ్బతిని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సుడా నిధులు కూడా వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టాలని నరేందర్ రెడ్డి ని కోరారు. అందుకు సానుకూలంగా స్పందించిన సుడా చైర్మన్ ఇప్పటివరకే నగరంలో అంతర్గత రోడ్లు, డ్రైనేజీలు, హైమాస్ లైట్లు మరియు పలు ప్రాంతాల సుందరీకరణ తదితర పనులను 20 కోట్ల పైన వెచ్చించామని తప్పకుండా అవసరమైన చోట పనులు చేపడుతామని సమస్యలు గుర్తించి ఎక్కడెక్కడ అవసరమో ఇంజనీరింగ్ అధికారులకు తెలియజేయజేస్తే టెండర్లు పిలిచి కార్పొరేటర్లు పిలిచి పనులు చేపడుతామని పేర్కొన్నారు. సుడా చైర్మన్ ను కలిసిన వారిలో కార్పోరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మరియు కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్, కార్పొరేటర్లు మల్లిఖార్జున రాజేందర్, చాడగొండ బుచ్చిరెడ్డి, గంట శ్రీనివాస్, వరాల నర్సింగం, పర్వతం మల్లేశం, కాంతాల జగన్ రెడ్డి, పడిశెట్టి భూమయ్య, ఆకుల ఉదయ్ తదితరులు ఉన్నారు.



# ప్రైవేటు పాఠశాలలకు దీటుగా సింగరేణి సీబీఎస్ఈ స్కూల్

## - జీఎం లు బండి వెంకటయ్య, ఎస్. వెంకటాచారి

**సూర్య, సెంటినరీ కాలనీ**

ప్రైవేటు పాఠశాలలకు దీటుగా సింగరేణి యాజమాన్యం సీబీఎస్ఈ స్కూల్ ఏర్పాటు చేయడం జరిగిందని ఆర్జీ-2 జీఎం బండి వెంకటయ్య, ఎడ్యుకేషన్ జీఎం ఎస్.వెంకటాచారి (ఎస్‌సీఈఎస్ కార్యదర్శి) అన్నారు. 8వ కాలనీ లోని సెక్టార్-3 లోని సింగరేణి సీబీఎస్ఈ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుందర్ రాజు అధ్యక్షత వహించగా ఆర్జీ-2 జనరల్ మేనేజర్ బండి వెంకటయ్య, జీఎం ఎడ్యుకేషన్ ఎస్. వెంకటాచారి (ఎస్‌సీఈఎస్ కార్యదర్శి) ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జనరల్ మేనేజర్ బండి వెంకటయ్య మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సింగరేణి యాజమాన్యం సీబీఎస్ఈ పాఠశాలను ఏర్పాటు



చేసినట్లు తెలిపారు. పాఠశాల నాణ్యతను మెరుగు పరచడానికి అర్హత కలిగిన, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులను నియమించాలని, వారికి తగిన వేతనాలు కల్పించాలని సూచించారు. అలాగే హై స్కూల్ నుంచి కాలేజీ స్థాయి వరకు విద్యా సౌకర్యాలు కల్పించాలని కోరారు. విద్యార్థులు పాఠశాలకు సెల్‌ఫోన్ లు తీసుకురాకుండా చర్యలు తీసుకోవాలని, పాఠశాల ప్రాంగణంలో ఉపాధ్యాయులు ఇంగ్లీషులో సంభాషించాలని, మధ్యాహ్న భోజనానికి భోజనశాల సదుపాయాలను మెరుగుపరచాలని సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి మెరుగైన ఫలితాలు సాధించాలని తెలిపారు. ఈ సూచనలపై జీఎం ఎడ్యుకేషన్ వెంకటాచారి, ప్రధానోపాధ్యాయులు సుందర్ రాజు సానుకూలంగా స్పందించారు. అనంతరం ఆర్జీ-2 జీఎం బండి వెంకటయ్య, ఎడ్యుకేషన్ జీఎం ఎస్.వెంకటాచారి (ఎస్‌సీఈఎస్ కార్యదర్శి) తో పాటు త్వరలో పదవీ విరమణ పొందనున్న ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ అరవింద్ రావు ( ఏజీఎం పర్సనల్ ), పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుందర్ రావు , మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహిపాల్, సీనియర్ ఎస్టేట్ ఆఫీసర్, సీబీఎస్ఈ కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ , చైతన్య టెక్నో స్కూల్ ఎన్ టి పి సి ఉదయ్ కుమార్, పేరెంట్ దీపిక,, టీచర్స్ వి.శ్రీనివాస్ చంద్రావతి తదితరులు పాల్గొన్నారు.

# రైతు భరోసా కోసం నూతన దరఖాస్తుల ఆహ్వానం

## - వ్యవసాయాధికారి చిందం శ్రీకాంత్

**సూర్య, సెంటినరీ కాలనీ**



రామగిరి మండలం లో రైతు భరోసా కోసం నూతన దరఖాస్తులు ఆహ్వానించడం జరుగుతుందని మండల వ్యవసాయాధికారి చిందం శ్రీకాంత్ ఒక ప్రకటన లో తెలిపారు. 28.02.2026 వరకు భూభారతి ద్వారా కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులు రైతు భరోసా పథకం కోసం తప్పనిసరిగా కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకోవడానికి కావలసిన పత్రాల గురించి పేర్కొన్నారు. రైతు భరోసా దరఖాస్తు ఫారం, పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్, బ్యాంకు పాస్ బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్ పత్రాలను జత చేసి సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారికి సమర్పించాల్సిందిగా రైతులకు సూచించారు. ఇంకా, తమ బ్యాంకు ఖాతాను మార్చుకోవాలనుకునే రైతులు కూడా సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించవచ్చని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను పొందాలని కోరారు. గతంలోనే రైతు భరోసా పథకం కింద లబ్ధి పొందిన రైతులు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని తెలిపారు.

# 15వ వార్డు సమస్యల పరిష్కారానికి కృషి

**సూర్య, హుజురాబాద్**



హుజురాబాద్ మున్సిపల్ పరిధిలోని 15 వ వార్డులో నెలకొని ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ రొంటాల సుహాసిని అన్నారు. మంగళవారం ఆమె 15వ వార్డులో కౌన్సిలర్ వెంకట నాయక్ తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా పలు వీధులను తిరిగి ప్రత్యక్షంగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఉప్పు శ్రీనివాస్ పటేల్ మాట్లాడుతూ... గత కొంత కాలంగా వార్డులో వీధిలైట్ల సమస్య ఉందని, పలు ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్య ఉందని, ఇంతేకాక పలు వీధుల్లో సిసి రోడ్ల నిర్మాణం ఇంకా పూర్తి కావాల్సి ఉందని అన్నారు. స్పందించిన మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని మాట్లాడుతూ... వార్డు సమస్యలను ప్రాధాన్యత క్రమంగా వాటిని పరిష్కరిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు గొట్టే జమదగ్ని, గోపి, వకుల, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ రైతులకు రైతు భరోసా నిధులు విడుదల చేయాలి.

## - ఎన్నికల హామీలను అమలు పరచాలి. - జగిత్యాల జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యులు ప్రసాద్.

**సూర్య సారంగపూర్**

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ పంటలు పండించే రైతాంగానికి రబీ పంటకు సంబంధించి రైతు భరోసా నిధులు వెంటనే విడుదల చేయాలని జగిత్యాల జిల్లా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యులు ఎండబెట్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. డిసెంబర్ నెలలో రబీ పంట ప్రారంభమై నాలుగు నెలలు గడుస్తున్నా నేటి వరకు రైతు భరోసా నిధులు విడుదల చేయకపోవడం శోచనీయమన్నారు. వెంటనే రైతులకు బేషరతుగా ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ అయ్యే విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చొరవచూపాలని అన్నారు. లేనిపక్షం లో రైతాంగానికి మద్దతుగా



బి ఆర్ ఎస్ పార్టీ తరుపున ఆందోళనల కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కెసిఆర్ ప్రభుత్వ హయాంలో రైతులకు రెండు పంటలకు రైతు పెట్టుబడి సహాయంగా పంట ప్రారంభంలోనే ముందుగా రైతు భరోసా నిధులు అందించే వారని పేర్కొన్నారు.తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో మూడు పంటలకు రైతు భరోసానిధులు ఇస్తామని ఓట్లు అడిగి తీరా అధికారంలోకి వచ్చాక పంట ప్రారంభంలో ఇవ్వకుండా కాలయాపన చేస్తూ రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఎన్నిక సమయంలో కౌలు రైతులకు సైతం ఆదుకుంటామని ఇచ్చిన హామీని మర్చిపోయారని ఎద్దేవా చేశారు. కళ్యాణ లక్ష్మి పథకంలో ఒక లక్ష రూపాయలు తోపాటు తులం బంగారం, ఇంటింటికి ప్రభుత్వ ఉద్యోగం, తెలంగాణ ఉద్యమకారులకు సముచిత స్థానం వంటి ఎన్నికల హామీలు అమలు చేయడంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ప్రసాద్ ధ్వజమెత్తారు. ఆయన వెంట టిఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి అనంతుల గంగారెడ్డి, మాజీ సర్పంచ్ బైరీ మల్లేష్ యాదవ్, సీనియర్ నాయకుడు సాంబారు గంగాధర్ ఉన్నారు.

# భీమన్నకు మంత్రి అడ్లూరి ప్రత్యేక పూజలు

**సూర్య, వేములవాడ**



భీమేశ్వర స్వామిని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి రాజన్నకు కోడెమొక్కులు చెల్లించుకున్నారు. మంత్రి వేములవాడ ఆలయానికి వచ్చిన సందర్భంగా ఆలయ పూజారులు మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ అధికారులు మంత్రి లక్ష్మణ్ కుమార్ కు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం బద్ది పోచమ్మ ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సిరిసిల్ల ఏఎస్పీ చంద్రయ్య, వేములవాడ డీఎస్పీ శ్రీనివాస్, తహసీల్దార్ జయంత్ కుమార్, ఆలయ పర్యవేక్షకులు జి. శ్రీనివాస్ శర్మ, ఎడ్ల శివసాయి, వేద పండితులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు దృష్టి సారించాలి



**సూర్య కొడిమ్యాల**

కొడిమ్యాల, పూడూర్, తిర్మలాపూర్ రైతు వేదికల్లో సోమవారం రైతు నేస్తం కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వి. భాస్కర్ పూడూర్ రైతు వేదికలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయంలో డ్రోన్ల వినియోగంపై శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. అలాగే జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ పథకం గురించి జిల్లా వ్యవసాయ అధికారి వి. భాస్కర్ రైతులకు శిక్షణ ఇచ్చారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి, రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారించాలని ఆయన సూచించారు.

అలాగే జీవన ఎరువులు అయిన ట్రైకోడెర్మా వీరిడే, పీఎస్‌బీ (భాస్వరం కరిగించే బ్యాక్టీరియా) వంటి వాటిని ఉపయోగించడం ద్వారా నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వివరించారు. ఈ పథకం కింద రైతులకు ఫార్మర్ కిట్లు, భూసార పరీక్షల విశ్లేషణ పత్రాలను పంపిణీ చేశారు.

అనంతరం గౌరపూర్ గ్రామంలో వరి పంటను పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పి. జ్యోతి, ఏఈవోలు రాజేష్, గ్రీష్మ, తేజస్విని, పూడూర్ గ్రామ సర్పంచ్ కడారి మల్లేశం, ఉపసర్పంచ్ సంతోష్, శ్రీరాములపల్లి గ్రామ ఉపసర్పంచ్ నర్సయ్యతో పాటు అభ్యుదయ రైతులు, వ్యవసాయ విద్యార్థులు పాల్గొన్నారు.

# రైతు భరోసా కు దరఖాస్తు చేసుకోవాలి.

## - సారంగాపూర్ ఏవో ప్రదీప్ రెడ్డి .

**సూర్య సారంగాపూర్**

అర్హులైనా రైతులు నూతన పట్టా పాస్ బుక్ వచ్చిన రైతులు రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ప్రదీప్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటన తెలిపారు.ప్రభుత్వం రైతు పెట్టుబడి కింద అందించే రైతు భరోసా కోసం ఫిబ్రవరి 28.2026 వరకు కొత్తగా పట్టా పాస్ పుస్తకాలు పొందిన రైతులు అర్హులన్నారు.అలాగే ఇప్పటివరకు రైతు భరోసా పొందని అర్హులైన రైతులు, వివరాలు నమోదు చేయని రైతులు వెంటనే రైతు వేదికల వద్ద వ్యవసాయ విస్తీరణ అధికారుల దగ్గర నమోదు చేసుకోవాలని సూచించారు.ఈ దరఖాస్తులు ఈ నెల 25 వరకు సమర్పించాలని అన్నారు. దరఖాస్తు పత్రంతో పాటు పట్టా పాస్, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ బుక్, సంబంధిత పత్రాలు తీసుకురావాలని తెలిపారు.

# పారిశుధ్య కార్మికులను ముందస్తుగా అరెస్ట్ చేసిన పోలీసులు

**సూర్య - ఎలిగేడు**

ఎలిగేడు మండలంలో పారిశుధ్య కార్మికులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం హైదరాబాద్‌కు వెళ్లే ప్రయత్నంలో ఉన్న సమయంలో ఈ చర్య తీసుకున్నట్లు ఎస్ఐ మధుకర్ తెలిపారు.ఈ సందర్భంగా ఇరుగురల నర్సయ్య, గోస్కి నరసయ్య,కొండయ్య, రమేష్, నరేష్, అంజయ్య, రాయపాక లక్ష్మన్,లను పోలీసులు అదుపులోకి తీసుకుని, అనంతరం సొంత పూచికత్తుతో విడుదల చేసినట్లు పేర్కొన్నారు.



# ముఖ్యమంత్రి హామీని నిలబెట్టుకోవాలి

## - పంచాయతీ కార్మికుల అరెస్టులపై నేతల ఆగ్రహం

**సూర్య, వీణవంక**

గ్రామ పంచాయతీ కార్మికుల న్యాయమైన హక్కులను కాలరాసేలా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని కార్మిక నేతలు డిమాండ్ చేశారు. ఈ నెల జీతాలను ప్రత్యేక బడ్జెట్ ద్వారా నేరుగా కార్మికుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాలని, గతంలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని అమలు చేయాలని వారు కోరారు. ?తమ డిమాండ్ల సాధన కోసం మంగళవారం హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించ తలపెట్టిన 'చలో హైదరాబాద్' ధర్నాకు వెళ్తున్న కార్మికులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేయడంపై నేతలు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ధర్నాకు సిద్ధమైన కార్మికులను తెల్లవారుజామునే పోలీసులు అదుపులోకి తీసుకోవడంపై కండె సదయ్య, అహంకాళి కొమురయ్య, కదం కిషన్ రావు, దాసరపు శంకర్ మండిపడ్డారు.



# జీతం పెరిగినా హోదా పెరుగదు

## - సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్

**సూర్య జగిత్యాల అర్బన్**

ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు సంపన్న శ్రేణి వర్తించదని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు, రిటైర్డ్ తహసీల్దార్ హరి అశోక్ కుమార్ వివరించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ కేంద్రంలో ఉద్యోగాల్లో సంపన్న శ్రేణి రిజర్వేషన్ల వర్తింపుపై జీతం పెరిగినా హోదా పెరుగదని, ఆదాయం ఒక్కటే సంపన్న శ్రేణికి కొలమానం కాదని సుప్రీం కోర్టు కీలక ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో నాన్ క్రీమిలేయర్ సర్టిఫికెట్ల జారీ - సంపన్న శ్రేణిపై అవగాహన సమావేశంను నిర్వహించారు. ఈ సందర్భంగా హరి అశోక్



కుమార్ మాట్లాడుతూ తెలంగాణ వెనుక బడిన తరగతుల సంక్షేమ శాఖ సర్ క్యులర్ నెంబర్ ఈ /424/2014 తేదీ 28-07-2014ద్వారా ఇచ్చిన వివరణ ఉత్తర్వుల ప్రకారం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వంలో పని చేస్తున్న ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు క్రీమిలేయర్ వర్తించదని, అదే విధంగా గ్రూప్ 3,గ్రూప్ 4 స్థాయిలో మొదట ఉద్యోగం పొంది పదోన్నతి ద్వారా వార్షిక ఆదాయం రూ. 8లక్షలు దాటినా వారు క్రీమిలేయర్ కింద కు రారని, వారి పిల్లలు ఓ బీసీ లుగా పరిగణిశీపబడుతారని,గ్రూప్ -1 స్థాయి, గ్రూప్ -2 స్థాయి ఉద్యోగాల్లో నియామకం అయిన వారి పిల్లలు మాత్రమే సంపన్న శ్రేణిగా పరిగణలోకి వస్తారని, వివరణలతో సహా వివరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ తహసీల్దార్ పి.హన్మంత్ రెడ్డి, సీనియర్ సిటిజెన్స్ జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథమ్, రిటైర్డ్ జిల్లా కో ఆపరేటివ్ అధికారి బొల్లం విజయ్,రిటైర్డ్ జిల్లా అటవీ శాఖ అధికారి పి.అశోక్ రావు,వివిధ సంఘాల ప్రతినిధులు మానాల కిషన్,సింగం గంగాధర్, పుప్పాల నర్సింగారావు, ఎం.డి.యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ నివారిద్దాం పర్యావరణాన్ని కాపాడుదాం

**- రామకృష్ణ విద్యార్థులకు ప్లాస్టిక్ అనర్థాలపై అవగాహన**

**సూర్య జగిత్యాల ప్రతినిధి**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల" ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా తెలంగాణ కాలుష్య నివారణ మండలి ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా కేంద్రంలోని రామకృష్ణ డిగ్రీ పీజీ కళాశాల విద్యార్థులకు ప్లాస్టిక్ వాడకము దాని ప్రభావాలపై అవగాహన సదస్సు నిర్వహించినారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర కాలుష్య మండలి అసిస్టెంట్ సైంటిస్ట్ మహేష్ కుమార్ హాజరై ప్లాస్టిక్ వాడకం ద్వారా సంభవించే పరిణామాలపై విద్యార్థులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పలు అంశాలను వివరించారు. ముఖ్యంగా సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడడం వల్ల పర్యావరణంతో పాటు మానవ ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం ఉంటుందని, సాధ్యమైనంతవరకు సింగిల్ యూస్ ప్లాస్టిక్కు వాడకుండా ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులచే సామూహికంగా ప్లాస్టిక్ నిషేధ ప్రతిజ్ఞను నిర్వహించినారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ పల్లెర్ల నరేష్, ప్రిన్సిపాల్ కొక్కుల రాజేందర్, అధ్యాపక సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

# షెడ్యూల్డ్ కులాల నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి పథకం

**- ఎంపిడిఓ బద్రి శైలజ రాణి**

**సూర్య, సెంటినరీ కాలనీ**



షెడ్యూల్డ్ కులాలకు చెందిన నిరుద్యోగ యువతీ యువకుల ఆర్థిక స్థితిని మెరుగు పరచేందుకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి స్వయం ఉపాధి పథకాల కింద ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానిస్తోందని రామగిరి ఎంపిడివో బద్రి శైలజ రాణి తెలిపారు. ఈ పథకం ద్వారా యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించి, ఆర్థిక పురోగతిని సాధించడమే లక్ష్యంగా ఉన్నట్లు తెలిపారు. దరఖాస్తు ప్రక్రియ ఈ నెల 17వ తేదీ నుంచి 24వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఓబిఎంఎంఎస్ పోర్టల్‌లో ఆన్‌లైన్ ద్వారా తమ దరఖాస్తులను నమోదు చేసుకోవాలని సూచించారు. వ్యవసాయేతర పథకాల కోసం అభ్యర్థుల వయస్సు 21 నుండి 50 సంవత్సరాల మధ్య ఉండాలి. వ్యవసాయ పథకాల కోసం 21 నుండి 60 సంవత్సరాల వరకు అనుమతి ఉంది. రవాణా రంగ పథకాలకు దరఖాస్తు చేసుకునే వారు శాశ్వత డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి. సోలార్ పంప్ సెట్ కోసం దరఖాస్తు చేసుకునే వారికి కనీసం 2 ఎకరాల భూమి ఉండి, సంబంధిత పట్టాదారు పాస్ పుస్తకం ఉండాలని తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కుల ధృవీకరణ పత్రం, ఆదాయ ధృవీకరణ పత్రం, పాస్‌పోర్ట్ సైజు ఫోటో సమర్పించాలని, అవసరమైతే డ్రైవింగ్ లైసెన్స్ లేదా పట్టాదారు పాస్ పుస్తకం కూడా జత చేయాలి. వికలాంగ అభ్యర్థులు సదరం సర్టిఫికెట్ తప్పనిసరిగా సమర్పించాలని తెలిపారు.

# రైలు కింద పడ్డ వ్యక్తి గుర్తింపు

**సూర్య జమ్మికుంట**



సోమవారం జమ్మికుంట రైల్వే స్టేషన్‌లో రైలు కింద పడి మృతి చెందిన వ్యక్తిని గుర్తించారు హుజూరాబాద్ పట్టణంలోని మామిండ్లవాడకు చెందిన గొర్రె మొగిలి మిస్సింగ్ అయినట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు పిర్యాదు చేసారు. జమ్మికుంట రైల్వే ఓవర్ బ్రిడ్జ్ సమీపంలో నిన్న గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి హుజూరాబాద్‌కు చెందిన గొర్రె మొగిలిగా గుర్తించి రైల్వే పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా వారు వచ్చి మృతుని గుర్తించి మృతదేహాన్ని తీసుకెళ్లారు.

# ఈద్గా వద్ద ముందస్తు ఏర్పాట్లు పూర్తి...

**- ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన మున్సిపల్ చైర్మన్**

**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**



ముస్లింల పవిత్ర పండుగ రంజాన్ సందర్భంగా పెద్దపల్లి పట్టణంలోని ఈద్గా వద్ద మున్సిపల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఏర్పాట్లను మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య మంగళవారం సందర్శించి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ నమాజ్ కోసం వచ్చే ముస్లిం సోదరులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మున్సిపల్ యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ముఖ్యంగా ఈద్గా పరిసరాల్లో శానిటేషన్ పనులు, త్రాగునీటి సౌకర్యం, ఎండ నుంచి ఉపశమనం కోసం టెంట్లు, ప్రార్థనల కోసం కార్పెట్లు తదితర ఏర్పాట్లు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు. పట్టణంలోని ముస్లిం సోదర సోదరీమణులందరూ సుఖసంతోషాలతో, ఆహ్లాదకరమైన వాతావరణంలో పండుగ జరుపుకోవాలని కోరుతూ వారికి ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ అస్లాం పర్వేజ్, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ సతీష్, వార్డ్ ఆఫీసర్ శ్రీనివాస్, శానిటరీ ఇన్స్పెక్టర్ పులిపాక రాజు, నాయకులు అజ్గర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాల కోసం మండల స్థాయి ఎంపికలు

**- క్రీడా పాఠశాలలతో విద్యార్థులు అంతర్జాతీయ స్థాయికి**

**- ఎంఈఓ శ్రీనివాస్**

**సూర్య కొడిమ్యాల**







కొడిమ్యాల మండల స్థాయి స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాల కోసం అభ్యర్థుల ఎంపికలను మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ అయిత శ్రీనివాస్ మాట్లాడుతూ క్రీడా పాఠశాలల్లో చదువుతో పాటు క్రీడల్లో ప్రత్యేక శిక్షణ అందించి విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా అవకాశం కల్పిస్తాయని తెలిపారు. అభ్యర్థులకు మోటార్ ఎబిలిటీ బ్యాటరీ టెస్టులు నిర్వహించి ఎత్తు, బరువు, స్టాండింగ్ బ్రాడ్ జంప్, షటిల్ రన్, వర్టికల్ జంప్, 800 మీటర్ల పరుగుతో సహా పలు విభాగాల్లో పరీక్షలు నిర్వహించారు. మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఈనెల 31న జగిత్యాలలో జరిగే జిల్లా స్థాయి ఎంపికలకు పంపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు ఆచి విజయేంద్ర, మాజీ ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి లక్ష్మీరాం నాయక్, కొడిమ్యాల మండల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి బూట్ల రాజామల్లయ్య, ఫిజికల్ డైరెక్టర్లు బీరయ్య, అనుప్ రెడ్డి, గంగాజలతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తికి అత్యవసర చికిత్స

**- రోగి ప్రాణాలు కాపాడిన ఆరోగ్య హాస్పిటల్ వైద్యులు**

**- ధన్యవాదాలు తెలిపిన కుటుంబ సభ్యులు**

**సూర్య జగిత్యాల ప్రతినిధి**

జగిత్యాల జిల్లా కేంద్రంలోని కృష్ణా నగర్‌లో గల ఆరోగ్య క్రిటికల్ కేర్, మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తికి అత్యవసర చికిత్స అందించి వ్యక్తి ప్రాణాలు కాపాడి ఆ కుటుంబ సభ్యుల ఆదరాభిమానాలు చురగొన్నారు. మేడిపల్లి మండలం కొండాపూర్ కు చెందిన మల్లయ్య ఈ నెల 12 న తీవ్రమైన గుండెపోటుకు గురి కాగా కుటుంబ సభ్యులు హుటాహుటిన జగిత్యాల లోని ఆరోగ్య హాస్పిటల్ కు తరలించారు. మల్లయ్య ఆరోగ్య పరిస్థితి అప్పటికే విషమంగా మారడంతో హాస్పిటల్ లోని ప్రముఖ కార్డియాలజిస్ట్ డా.కిషన్ రోగికి సిపిఆర్ చేసి 14 సైకిల్స్ ఎలక్ట్రిక్ షాక్ సహాయంతో ప్రాణాల్ని నిలబెట్టి తరువాత అంజియోగ్రామ్, స్టంట్ వేశారు. ఐదు రోజులు అబ్జర్వేషన్లో పెట్టి మంగళవారం పూర్తి ఆరోగ్యంగా ఉన్న రోగిని డిశ్చార్జి చేశారు. ఈ చికిత్స ఆరోగ్య శ్రీ ద్వారా పూర్తిగా ఉచితంగా చేసి ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగి ప్రాణాలు కాపాడినందుకు ఆరోగ్య క్రిటికల్ కేర్, మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు డా. కిషన్, డా.సౌజన్య రెడ్డి, డా.కే.వీరేందర్, డా.నవీన్ లతో పాటు హాస్పిటల్ యాజమాన్యానికి రోగి బంధువులు ధన్యవాదాలు తెలిపారు.

# జిల్లా కేంద్రంలో ఇంటర్మీడియట్ రెండవ విడత మూల్యాంకనం ప్రారంభం

**సూర్య జగిత్యాల ప్రతినిధి**

జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఎస్ కే ఎన్ ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నుండి రెండవ విడత మూల్యాంకనము ప్రారంభమవుతుంది అని క్యాంప్ ఆఫీసర్ బి నారాయణ తెలిపారు. రెండవ విడతలో భౌతిక శాస్త్రము, రసాయన శాస్త్రం, అర్థశాస్త్రము సబ్జెక్టులలో మూల్యాంకనము ప్రారంభించబడుతుంద .ప్రభుత్వ, ప్రైవేటు, మోడల్ స్కూల్ జూనియర్ కళాశాల, మైనారిటీ కళాశాల, సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, కస్తూర్బా గాంధీ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకులు పై సబ్జెక్ట్స్ బోధించేవారు విధిగా మూల్యాంకన కేంద్రంలో పనిచేయుటకు ఉదయము 10 గంటలకు హాజరుకావలెను. మీ కళాశాల లాగిన్లలో గల ఆర్డర్స్ను డౌన్లోడ్ చేసుకుని ప్రిన్సిపాల్ ద్వారా రిలీవింగ్ ఆర్డర్ను తీసుకొని బుధవారం రోజున హాజరు కాగలరు అన్నారు. ఎవరైనా అధ్యాపకుల ఆర్డర్స్ కళాశాల లాగిన్లలో గనక లేనప్పుడు కళాశాల నుండి రిలీవింగ్ ఆర్డర్తో క్యాంప్ ఆఫీసర్ని సంప్రదించగలరు. మూల్యాంకన విధులలో ఎవరికి మినహాయింపు లేదని ఆర్డర్స్ వచ్చిన ప్రతి ఒక్కరూ విధులలో చేరవలసిందిగా నిబంధనల ప్రకారం విధులలో పాల్గొనని వారిపై చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా తెలియజేశారు.

# వెల్గటూర్ పోలీసు స్టేషన్ ఆకస్మిక తనిఖీ

**సూర్య వెల్గటూర్**



జగిత్యాల జిల్లా వెల్గటూర్ పోలీసు స్టేషన్‌ను సిఐ రాంనరసింహారెడ్డి మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్ పరిసర ప్రాంతాలు, రికార్డులు పరిశీలించి,పోలీసు సిబ్బంది పనితీరుపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. పోలీసులు విధుల్లో క్రమశిక్షణ పాటిస్తూ,కేసులను త్వరితగతిన పరిష్కరించాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పి.ఉదయ్ కుమార్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తాళం వేసి అన్న ఇంట్లో చోరీ

**- 2 తులాల బంగారం అపహరణ**

**సూర్య - పెద్దపల్లి రూరల్**



పెద్దపల్లి మండలం తుర్కలమద్దికుంటలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. గ్రామానికి చెందిన గంట్ల మణెమ్మ మల్లారెడ్డి దంపతులు అనారోగ్యంతో తన కుమారుడి దగ్గరకు పెద్దపల్లికి 3 రోజుల క్రితం వెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చే సరికి ఇంటి తాళం పగులగొట్టి ఇంట్లో బీరువాను ధ్వంసం చేశారు. బీరువాలోని 2 తులాల బంగారం, 10 వేల నగదు గుర్తుతెలియని వ్యక్తులు దోచుకెళ్ళారని మల్లారెడ్డి తెలిపారు. రూరల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధితుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై మల్లేశం తెలిపారు.

# గతంలో 'దొడ్డు బియ్యం'– ప్రజా ప్రభుత్వంలో 'సన్న బియ్యం'

## - కూలిన కాళేశ్వరం.. పారిన ఎల్లంపల్లి నీళ్లు - అబద్ధాలు వద్దు.. అభివృద్ధికి సహకరించండి

## - అసెంబ్లీలో బీఆర్ఎస్‌పై విప్ ఆది శ్రీనివాస్ గర్జన



**సూర్య, వేములవాడ**

అసెంబ్లీ సాక్షిగా రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గత ప్రభుత్వ తీరును ఎండగడుతూ, ప్రస్తుత ప్రజా ప్రభుత్వ విజయాలను గళం విప్పారు. గత పాలనలో "వరి వేస్తే ఉరి" అని రైతులను భయపెట్టిన పరిస్థితి ఉంటే, నేడు అదే రైతులు 71.86 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు పండించి రికార్డు సృష్టించారని ఆయన కొనియాడారు.రైతు భరోసా, పనిముట్ల పంపిణీతో పాటు సన్న వడ్లకు బోనస్ అందిస్తూ అన్నదాతకు అండగా ఉంటున్నామని ఆయన తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయినప్పటికీ, ఎల్లంపల్లి నీటితో పంటలను పండించి రైతులకు భరోసా కల్పించామ న్నారు. సుమారు 3.76 లక్షల మందికి కొత్తగా పట్టా పాస్ పుస్తకాలు అందించిన ఘనత తమ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. గతంలో చుట్టాలు వస్తేనే సన్న బియ్యం కొనుక్కునే పరిస్థితి ఉండేదని, ఇప్పుడు ప్రతి పేదవాడు సన్న బియ్యం తినేలా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. 15.12 లక్షల మందికి కొత్త రేషన్ కార్డులు ఇచ్చి, దాదాపు 3 కోట్ల మందికి ఆహార భద్రత కల్పిస్తున్నామని వివరించారు.మహిళా సంఘాలకు 600 బస్సులు కేటాయించి వారిని ఆర్థికంగా బలోపేతం చేస్తున్నామని, ఇందిరమ్మ ఇళ్లు లేని ఊరు లేదని ఆయన పేర్కొన్నారు. గద్దర్ వంటి ఉద్యమకారులకు గతంలో అపాయింట్‌మెంట్ కూడా దక్కలేదని, కానీ తమ ప్రభుత్వం ఆయన పేరుతో అవార్డులు ఇస్తూ గౌరవిస్తోందని గుర్తు చేశారు. గల్ఫ్ కార్మికుల కోసం ప్రజాభవన్‌లో ప్రత్యేక కార్యాలయం, సమ్మక్క సరళమ్మ అభివృద్ధికి 150 కోట్లు కేటాయించామని చెప్పు.. బిఆర్ఎస్ నాయకులు ఇప్పటికైనా అబద్ధాలు మానుకుని ప్రభుత్వానికి సహకరించాలని ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు.

# విద్యార్థుల్లో దాగి ఉన్న మేధాశక్తిని వెలికి తీయడానికే బాల మేధ

## - మండల స్థాయిలో క్విజ్ పోటీలు - ప్రతిభ చాటిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

## - ప్రథమ స్థానంలో ఎంపిపిఎస్ ఊటుపల్లి విద్యార్థులు - మండల విద్యాధికారి లోకిని శ్రీనివాస్

**సూర్య - కథలాపూర్**



విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకత,మేధశక్తిని వెలికి తీసేందుకే నిర్వహించిన బాల మేధ క్విజ్ పోటీలని మండల విద్యాధికారి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం విద్యాధికారి పర్యవేక్షణలో కథలా పూర్, అంబారీ పేట, సిరికొండ కాంప్లెక్స్ పరిధిలోని విద్యార్థులకు పోటీలను నిర్వహించారు. వివిధ పాఠశాలల నుండి విద్యార్థులు హాజరై తమ ప్రతిభాపాటవాలను ప్రదర్శించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన మొదటి మూడు స్థానాల్లో నిలిచిన పాఠశాలల వివరాలను ప్రకటించారు. మొదటి స్థానంలో ఎం పి పి ఎస్ పాఠశాల ఊటుపల్లి, ద్వితీయ స్థానంలో ఎం పి యు పి ఎస్ పోసాని పేట, తృతీయ స్థానంలో దుంపేట (ఎస్సి కాలని), ప్రథమ స్థానంలో ఎం పి పి ఎస్ బొమ్మెన, ద్వితీయ స్థానంలో బొమ్మెన (బి సి కాలని), తృతీయ స్థానంలో ఎం పి పి ఎస్ సిరి కొండ, ప్రథమ స్థానంలో ఎం పి పి ఎస్ తాండ్రియాల, ద్వితీయ స్థానంలో ఎం పి పి ఎస్ అంబారీ పేట, తృతీయ స్థానంలో ఎం పి పి ఎస్ తాండ్రియాల (విసి)పాఠశాలలు నిలిచాయని అన్నారు. ఆనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో చిన్నతనం నుండి పోటీతత్వాన్ని పొంపొందించేందుకు బాల మేధ ఉపయోగపడుతుందని అన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసం పెరుగుతుందని అన్నారు. ప్రతి ఏటా ఈ పోటీలను ప్రతి ఏటా నిర్వహిస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మారంపల్లి అర్జున్, కిసాన్ రావు,పాఠశాల ప్రధానోపాధ్యాయులు మార్గం రాజేంద్ర ప్రసాద్,గడ్డం శ్రీనివాస్ రెడ్డి, మామిడిపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఆల్లె పరమేశ్వర్, క్విజ్ మాస్టర్లు మహేందర్, రమేష్‌లు వ్యవహరించారు. రాజశేఖర్, రాజేశ్వర్ రావు, విజయ, అజయ్, గణేశ్,రాజేందర్, కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

# ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన

## - రైతులకు అవగాహన కల్పించిన సహాయ, వ్యవసాయ సంచాలకులు ప్రదీప్ కుమార్

**సూర్య గంభీరావుపేట**



రైతులు సేంద్రియ, ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంబించి భూమి ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ అధిక ఆదాయం పొందాలని సహాయ వ్యవసాయ సంచాలకులు (ADA) ప్రదీప్ కుమార్ సూచించారు. మంగళవారం గంభీరావు పేట మండలం నర్మాల రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో "వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ATMA)" కార్యక్రమం ద్వారా రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సలావుద్దీన్, ఏఈఓ సందీప్ కుమార్ లు పాల్గొని రైతులకు ప్రకృతి వ్యవసాయం, పంట మార్పిడి విధానం, పచ్చిరొట్ట ఎరువుల వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలపై వివరించారు. సేంద్రియ వ్యవసాయం ప్రాముఖ్యత, ఆయిల్ ఫామ్ సాగు ప్రోత్సాహం, యూరియా వినియోగాన్ని తగ్గించే విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. సేంద్రియ వ్యవసాయం ద్వారా భూమి సారాన్ని పెంచడంతో పాటు మానవ ఆరోగ్యాన్ని కూడా పరిరక్షించవచ్చని తెలిపారు. రైతులు సమగ్ర వ్యవసాయ విధానాలను అనుసరిస్తూ ఆదాయం పెంచే పంటలను ఎంచుకోవాలని సూచించారు. రసాయన ఎరువుల అధిక వినియోగం వల్ల భూమి కాలుష్యానికి గురవుతుందని, దీని వల్ల భవిష్యత్తులో దిగుబడులు తగ్గే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అందువల్ల రైతులు ప్రకృతి, సేంద్రియ వ్యవసాయ పద్ధతుల వైపు మొగ్గు చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నర్మాల గ్రామ సర్పంచ్ రాజబోయిన అర్చన–అంజనేయులు, కోళ్లమద్ది సర్పంచ్ ఏడబోయిన దిలీప్ ఉప సర్పంచులు గొర్రె సుదర్శన్ చాత్రబోయిన లక్ష్మణ్ ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై బీజేపీ నిరసన..

### - తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత

**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**



తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ భారతీయ జనతా పార్టీ పెద్దపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో ధర్నా నిర్వహించారు. అనంతరం మండల బీజేపీ అధ్యక్షులు వేల్పుల రమేష్ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా వేల్పుల రమేష్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. నిరుద్యోగ యువతకు ఇచ్చిన భరోసాను విస్మరించారని, అర్హులైన ఇల్లు లేని పేదలకు వెంటనే ఇళ్లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రైతాంగ సమస్యలపై స్పందిస్తూ రైతు భరోసా, సన్న వడ్లకు బోనస్ సకాలంలో చెల్లించాలని, రుణమాఫీని ఎటువంటి కొర్రీలు లేకుండా సంపూర్ణంగా అమలు చేయాలని కోరారు.అదేవిధంగా, ప్రభుత్వం ప్రకటించిన విధంగా కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద 1,00,116 లతో పాటు తులం బంగారం ఇవ్వాలని, మహాలక్ష్మి పథకం ద్వారా అర్హులైన మహిళలకు నెలకు 2,500 వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. వితంతువులు, వృద్ధులకు పెన్షన్ల పంపిణీలో జరుగుతున్న ఆలస్యాన్ని నివారించాలని పత్రికా ముఖంగా ప్రభుత్వాన్ని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రజా సమస్యలను పరిష్కరించకుంటే బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు తంగడ రాజేశ్వరరావు, పోల్సాని సంపత్ రావు, దాడి సంతోష్, మేకల శ్రీనివాస్, వోల్లే తిరుపతి, కందుల సదయ్య, మామిడి ఉమేష్, శిరాలపు మహేష్, రెండ్ల వేణు పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలనలో జేఎన్టీయూ విద్యార్థులు

### - అభినందించిన ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్

**సూర్య, సెంటినరీ కాలనీ**



తెలంగాణ ప్రభుత్వం ఆదేశాల మేరకు తెలంగాణ నేషనల్ గ్రీన్ కార్ప్స్ కార్యక్రమాలు మంథని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ బలుసు విష్ణువర్ధన్, వైస్ ప్రిన్సిపాల్ ఎం.ఉదయ్ కుమార్ ఆదేశాల మేరకు ఉత్సాహంగా సాగుతున్నాయి. పది రోజుల కార్యక్రమంలో భాగంగా మంగళవారం నేచర్ క్యాంప్, విజిట్ వేస్ట్ మేనేజ్మెంట్, పేపర్ క్రాఫ్ట్ కార్యక్రమాలు జరిగాయి. వేస్ట్ మేనేజ్మెంట్ లో భాగంగా సింగరేణి సంస్థ ఆర్జీ–2 ఏరియాలోని పోతన కాలనీ సీవరేజ్ ట్రీట్ ప్లాంట్‌ను సందర్శించారు. నేచర్ క్యాంప్‌లో భాగంగా జూలపల్లిలోని ఒక ప్రైవేట్ ఫామ్‌తో పాటు గార్డెన్స్, కృషి విజ్ఞాన్ కేంద్రం తిలకించారు. కెవికెకు చెందిన సైంటిస్టులు విద్యార్థులకు పలు అంశాలను వివరించారు.కార్యక్రమంలో కాంట్రాక్టు అధ్యాపకులు కావ్య,పింగిళి కృష్ణారెడ్డి, సాయి దీక్షిత్, వంశీకృష్ణ, శివకృష్ణ, అజ్మీర నరహరి, రాజేష్ కుమార్, శ్రీధర్, మహిపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఈ నెల 20న మండల స్థాయి క్రీడా పాఠశాల ఎంపిక పోటీలు

**సూర్య-ఎలిగేడు**

ఎలిగేడు మండల స్థాయి క్రీడా పాఠశాల ఎంపిక పోటీలను ఈ నెల 20న ఎలిగేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి ఏ. నరేంద్ర చారి తెలిపారు.ఈ పోటీల నిర్వహణపై మంగళవారం ఎలిగేడు ఎంఆర్సీలో మండలంలోని వ్యాయామ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు మూడవ తరగతి చదువుతూ ఉండాలి మరియు 2017 సెప్టెంబర్ 1 నుండి 2018 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలని పేర్కొన్నారు.అభ్యర్థులు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుని, తగిన ధ్రువపత్రాలతో ఈ నెల 20న ఉదయం 8:00 గంటలకు హాజరు కావాలని సూచించారు. మండల స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు మార్చి 28 నుండి ఏప్రిల్ 1 వరకు జరిగే పెద్దపల్లి జిల్లా స్థాయి క్రీడా పాఠశాల ఎంపిక పోటీలలో పాల్గొంటారని తెలిపారు.ఈ సమావేశంలో వ్యాయామ ఉపాధ్యాయులు కె. ప్రణయ్, ఎల్. శ్రీనివాస్, వి. శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు నేస్తం 86వ ఎపిసోడ్‌లో సేంద్రీయ వ్యవసాయంపై అవగాహన

**సూర్య - ఎలిగేడు**



ఎలిగేడు రైతు వేదికలో దృశ్య–శ్రవణ మాధ్యమం ద్వారా నిర్వహించిన రైతు నేస్తం 86వ ఎపిసోడ్ కార్యక్రమంలో రైతులకు పలు ముఖ్య అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సేంద్రీయ వ్యవసాయం ప్రాముఖ్యత, ఎరువుల బుకింగ్ యాప్ వినియోగం, సాయిల్ హెల్త్ కార్డు ప్రయోజనాల గురించి వివరించారు. అదేవిధంగా ఆధునిక వ్యవసాయ పద్ధతుల్లో డ్రోన్ వినియోగంపై కూడా రైతులకు అవగాహన కల్పించారు. తదనంతరం రైతులకు సాయిల్ హెల్త్ కార్డులు మరియు సేంద్రియ వ్యవసాయానికి సంబంధించిన కిట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఉమాపతి, ఎలిగేడు సర్పంచ్ కప్పల ప్రవీణ్, ఏఈఓ సురేష్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం

**సూర్య - పెద్దపల్లి రూరల్**



పెద్దపల్లి మండలం బ్రాహ్మణపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సర్పంచ్ మేకల రోజారాణి విజయ్ మంగళవారం శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ఎమ్మెల్యే విజయ రమణారావు కేటాయించిన నిధులతో సీసీ రోడ్డు నిర్మిస్తున్నారు. రూ.15 లక్షల డిఎంఎఫ్టి, ఎసిడిపి నిధులతో 3 ప్రాంతాల్లో త్వరితగతిన సీసీ రోడ్లు నిర్మాణం పూర్తి చేయనున్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ జంగిలి శేఖర్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు. రూ 5 లక్షల ఎస్సీ సబ్ ప్లాన్ నిధులతో ఎస్సీ కాలనీలో రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు.

# కుక్క కాటుకు బాలుడు మృతి

## - రూ.50 లక్షలు వెచ్చించిన దక్కని ప్రాణం - కోటిలింగాలలో విషాద ఘటన

**సూర్య వెల్గటూర్**

కుక్కల దాడులు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. వీధి కుక్కల పట్ల ఎంత అప్రమత్తంగా ఉంటున్నా వాటి దాడి నుండి తప్పించుకోవడం కష్టంగా ఉంది. సుప్రీంకోర్టు వీటి నియంత్రణపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలపై పలు ఆదేశాలు జారీచేసింది. అయిన రాష్ట్రంలో ఈ దాడులు ఆగడం లేదు. ఎందరో పిల్లలు కుక్కల దాడికి గురై ప్రాణాలు కోల్పోయారు. కొన్ని నెలల క్రితం కుక్క కాటుకు గురై బాలుడు బాధపడుతూ మరణించిన బాలుడి విషాదకర సంఘటన ఇది కోటిలింగాల గ్రామంలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కోటిలింగాల గ్రామానికి చెందిన మంచికట్ల శ్రీనివాస్-మాధవి దంపతుల కుమారుడు మణితేజ(8) అయితే శ్రీనివాస్ హైదరాబాద్‌లో సాఫ్ట్ వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు.దగ్గరి బంధువుల వివాహం ఉండగా స్వగ్రామం కోటిలింగాల కు వచ్చాడు.మణి తేజ ఆరుబయట చిన్నారులతో ఆడుకుంటూ ఉండగా 2024 డిసెంబర్26న మణి తేజ ఎడమవైపు మెడ, భుజం మధ్య భాగంలో కుక్క కరిచింది. గమనించిన తల్లిదండ్రులు ఆస్పత్రికి తరలించి టీకా వేయించారు. సంక్రాంతి సెలవులకు మళ్ళీ ఇంటికి వచ్చిన తర్వాత మణి తేజకు జ్వరం వచ్చింది.చికిత్స కోసం ఓ ప్రయివేట్ ఆస్పత్రికి



తీసుకెళ్లగా శ్వాస ఇబ్బందిగా మారింది.మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ లోని ప్రయివేట్ హాస్పిటల్ కి తరలించారు.వెన్నుముక నుంచి మెదడు రక్తం సరఫరా చేసే నరం దెబ్బతిన్నట్లు వైద్యులు తెలిపారు.అప్పటినుంచి శరీర కదలికలు మినహా ఎలాంటి స్పందన లేకపోవడంతో వేంటిలేషన్‌పై చికిత్స అందించారు.బాలుడి చికిత్స కోసం తమ స్తోమతకు మించి 50 లక్షల రూపాయలు వెచ్చించిన ప్రాణం కాపాడు కోలేక పోయామని తల్లిదండ్రులు వాపోయారు.బాలుడి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చి అంత క్రియలు చేశారు.మణితేజ మృతితో కోటిలింగాల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# హామీలు అమలు చేయకపోతే ఆందోళన

## - మండలంలో సమస్యలు తక్షణమే పరిష్కరించాలని తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేసిన బీజేపీ నాయకులు

**సూర్య కోనరావుపేట**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, మండలంలోని ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని బీజేపీ మండల అధ్యక్షుడు మిర్యాల్ కార్ బాలాజి అన్నారు.మంగళవారం కోనరావుపేట మండల కేంద్రంలో తహశీల్దార్ వరలక్ష్మికి బిజెపి నాయకులు వినతి పత్రం అంధజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ... ప్రభుత్వం ప్రకటించిన జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి, ఆసరా పెన్షన్లు, కళ్యాణ లక్ష్మి, గృహ నిర్మాణ పథకం, రైతు భరోసా వంటి హామీలు అమలు కావడం లేదని ఆరోపించారు. దీంతో ప్రజలు తీవ్ర నిరాశకు గురవుతున్నారని పేర్కొన్నారు.మండలంలో రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రైతు భరోసా సకాలంలో అందకపోవడంతో అప్పులపై ఆధారపడాల్సి వస్తోందని తెలిపారు. అలాగే వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులకు పెన్షన్లు అర్హులకు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెన్షన్ కోసం దరఖాస్తు చేసిన వారికి వెంటనే మంజూరు చేయాలని కోరారు.భూభారతి రెవెన్యూ సదస్సుల్లో సమర్పించిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని, పేదలకు గృహ నిర్మాణ పథకం కింద ఇళ్ల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాలు, వీధి దీపాల సమస్యలను కూడా వెంటనే పరిష్కరించాలని అధికారులను కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే ఆందోళన చేపడతామని బీజేపీ నాయకులు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బిజెపి మండల ఉపాధ్యక్షులు చింతల పర్శరాములు, మధు,బిజెపి మహిళ మోర్చా అధ్యక్షురాలు తీగల జయశ్రీ గౌడ్,మాజీ వైస్ ఎంపిపి తీగల రవీందర్ గౌడ్,బీజేపీ నాయకులు మోత్కు మోహన్, విజయ్, నాగరాజు, పాలకుర్తి శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# రజక బిడ్డపై దాడి ఘటనపై నిందితుల అరెస్టు చేయాలని డిమాండ్

**సూర్య - ఎలిగేడు**

ఎలిగేడు మండలం లోని బురహంయాపేట గ్రామంలో అనగారిన వర్గానికి చెందిన రజక యువకుడిపై జరిగిన దాడి ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు చంద్రగిరి పరుశురాములుపై అదే గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు గోదెల వెంకట రెడ్డి, గోదేల సాయినాథ్ రెడ్డి, గాదె రాం నరసింహా రెడ్డి, గాదె బుచ్చిరెడ్డి, గోదేల సంజీవ రెడ్డి, మారం హరీష్ రెడ్డి, మాడుగుల శ్రీనివాస్ రెడ్డి, గుర్రాల శ్రీనివాస్ రెడ్డి, మాడుగుల సంపత్ రెడ్డి కుల అహంకారంతో దాడి చేసినట్లు ఆరోపణలు వచ్చాయి.ఈ ఘటనపై స్పందించిన కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేష్ మాట్లాడుతూ, రజక జాతికి చెందిన వ్యక్తి రాజకీయాల్లో ఉండకూడదంటూ దుర్భాషలాడుతూ ఇంట్లోకి చొరబడి కర్రలతో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడటం



హేయమైన చర్య అని ఖండించారు. ఈ ఘటనలో పాల్గొన్న నిందితులను వెంటనే అరెస్టు చేసి రిమాండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ రోజు సాయంత్రం లోగా ఎఫ్ఐఆర్ నమోదు చేసి తక్షణ చర్యలు తీసుకోకపోతే, రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టి, ఉన్నతాధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి న్యాయపరంగా పోరాడతామని హెచ్చరించారు. ఎలిగేడు లో విలేకరుల సమావేశంలో కరీంనగర్ జిల్లా మాజీ రజక సంఘం అధ్యక్షుడు గంగిపల్లి వెంకటేష్, గ్రామ కాంగ్రెస్ నాయకులు గోపు లక్ష్మారెడ్డి, బేటి రవీందర్‌రావు, గట్ల మల్లారెడ్డి, పుల్యాల మధుకర్ రెడ్డి, నిరంజన్ గౌడ్, మొగురం చంద్రయ్య, బీజేపీ జిల్లా నాయకుడు గుజ్జుల మల్లారెడ్డి, గ్రామ పెద్దలు చంద్రగిరి రాజయ్య, కొత్తకొండ శ్రీను, కొత్తకొండ సంపత్, చంద్రగిరి లక్ష్మిరాజం తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లమ్మ ఉత్సవాలకు సర్పంచ్ రూ.12,016 విరాళం

**సూర్య, సెంటినరీ కాలనీ**



రామగిరి మండలం రత్నాపూర్ గ్రామంలో మంగళవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా ఎల్లమ్మ బోనాల ఉత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా డప్పులు, జమిడికల వాయిద్యాలతో గౌడ కులస్తుల మహిళలు నెత్తిన బోనాలు ఎత్తుకుని ర్యాలీగా వెళ్లారు. స్థానిక సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీ రావు రూపాయలు 12,016 విరాళంగా అందించారు. గ్రామాన్ని దేవత చల్లగా చూడాలనీ కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు నగునూరి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కెక్కర్ల శ్రీనివాస్, వార్డు సభ్యులు పబ్బ స్రవంతి వెంకటేష్, కెక్కర్ల ఉష అశోక్,పబ్బ మొగిలి, కెక్కర్ల చిన్న సమ్మయ్య, నగునూరి శ్రీనివాస్, ముక్కెర కుమార్, పబ్బ వెంకటేష్, ముక్కెర ఓదెలు, కేక్కర్ల రాములు,శంకరయ్య, ముక్కెర చిన్న, కెక్కర్ల రాకేష్, కెక్కర్ల నగేష్, కెక్కర్ల శ్రీనివాసు, కెక్కర్ల సమ్మయ్య, ముక్కెర సారథి, దాసరి రామచంద్రం పాల్గొన్నారు.

## విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే ఏప్రిల్ 8 నుండి సమ్మె

**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**

విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే ఏప్రిల్ 8 నుండి సమ్మెకు దిగుతామని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టివిఏఇజెఎసి) ఉమ్మడి కరీంనగర్ జిల్లా చైర్మన్ తూళ్ళ నాగరాజు హెచ్చరించారు. విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిజన్, అన్ మ్యాన్డ్, పీస్ రేటు కార్మికుల సమస్యలపై తెలంగాణ జెన్ కో (టిజి జెన్ కో), ట్రాన్స్‌కో (టిజి ట్రాన్స్‌కో), ఎస్పీడిసిఎల్ (టిజి ఎస్పీడిసిఎల్), ఎన్పీడిసిఎల్ (టిజి ఎన్పీడిసిఎల్) సంస్థల చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్లకు (సిఎండి) సమ్మె నోటీసు అందజేసినట్లు తెలిపారు. 25 ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. ఇందులో భాగంగా ఈ నెల 26, 30 తేదీల్లో డివిజన్ కార్యాలయాల వద్ద ధర్నా, ఏప్రిల్ 2న సర్కిల్ కార్యాలయాల వద్ద వంటా వార్పు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఏప్రిల్ 7న 'ఛలో వరంగల్' పేరిట ఎన్పీడిసిఎల్ (టిజి ఎన్పీడిసిఎల్) కార్యాలయం వద్ద మహా ధర్నా చేపడతామని, అప్పటికీ స్పందన లేకపోతే ఏప్రిల్ 8న ఉదయం 9 గంటల నుండి నిరవధిక సమ్మెకు వెళ్తామని స్పష్టం చేశారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ పై కఠిన చర్యలు

**- నలుగురిపై కేసులు, ఒకరికి జైలు శిక్ష**
**- ట్రాఫిక్ సీఐ బి. రాజేశ్వరరావు**

**సూర్య-గోదావరిఖని**



రామగుండం ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ పై కఠిన చర్యలు కొనసాగిస్తున్నారు. ఈ మేరకు రామగుండం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ బి.రాజేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో మద్యం సేవించి వాహనం నడుపుతున్న నలుగురు వ్యక్తులను పట్టుకున్నారు. పట్టుబడిన వారిని మంగళవారం గోదావరిఖనిలోని సెకండ్ అడిషనల్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా, ముగ్గురు వ్యక్తులకు ఒక్కొక్కరికి రూ.6,000 చొప్పున జరిమానా విధించారు. కాగా, ఒక వ్యక్తి రెండోసారి డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడినందున అతనికి 3 రోజుల జైలు శిక్ష విధించారు. శిక్ష పడ్డ వ్యక్తిని కరీంనగర్ జిల్లా జైలుకు తరలించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ బి.రాజేశ్వరరావు మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనం నడపడం ప్రాణాంతకమని, అలా చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనదారులు తమ వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలు కలిగి ఉండాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ట్రాఫిక్ నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని సీఐ రాజేశ్వరరావు తెలిపారు.

# మత సామరస్యానికి, ఐక్యత, దాన గుణానికి ప్రతీక రంజాన్ పండగ

## - ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్

**సూర్య,రాయికల్**

మత సామరస్యానికి,ఐక్యత,దాన గుణానికి ప్రతీక రంజాన్ పండుగ అని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు.రాయికల్ పట్టణ లక్ష్మీ గార్డెన్స్ లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆద్వర్యం లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పవిత్ర రంజాన్ ఉపవాస దీక్ష సందర్భంగా ముస్లిం సోదరుల కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు హిందూ ముస్లిం ఆత్మీయత,మతసామరస్యానికి ,ఐక్యత, పరస్పర గౌరవం,దాన గుణానికి ప్రతీక అని అన్నారు.ఇలాంటి ఇఫ్తార్ విందులు మన సమాజంలో సౌహార్దం,ఐక్యత, పరస్పర గౌరవం మరింత పెరగడానికి సహాయపడతాయి అన్నారు,అనంతరం మైనార్టీ నాయకులతో కలిసి భోజనం చేశారు.ఈ కార్యక్రమంలో కమిషనర్ నాగరాజు,తహసీల్దార్ నాగార్జున,ఎంపీడీ చిరంజీవి,మున్సిపల్ చైర్మన్ కట్కం రవీందర్,వైస్ ఛైర్మన్ సౌజన్య శ్రీదర్ రెడ్డి,మాజీ ఛైర్మెన్ మోర హనుమండ్లు,ఆత్మ ఛైర్మెన్ కాటిపెల్లి గంగా రెడ్డి,కౌన్సిలర్ లు రాకేష్ నాయక్, పల్లికొండ గంగాధర్, నాయకులు అనిల్ కుమార్ బత్తిని నాగరాజు,మచ్చ శేఖర్, సీనియర్ నాయకులు పడిగేల రవీందర్ రెడ్డి, కోల శ్రీనివాస్, రాయికల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రవీందర్ రావు,మాజీ పాక్స్ చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మెన్ గన్నె రాజిరెడ్డి, ఇంతియాజ్,అచ్యుతరావు,పట్టణనాయకులు,మైనార్టీ నాయకులు షాకీర్,సోహెల్,మున్ను తదితరులు పాల్గొన్నారు.



# చల్లూరులో ఘనంగా ఇఫ్తార్ విందు

## - మతసామరస్యానికి ప్రతీకగా రంజాన్ వేడుకలు

**సూర్య, వీణవంక**



కులమతాలకు అతీతంగా, అన్ని వర్గాల ప్రజలు పండుగలను సంతోషంగా జరుపుకోవాలన్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సంకల్పంతో వీణవంక మండలంలోని చల్లూరు గ్రామంలో ముస్లిం సోదరులకు అధికారికంగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ యంత్రాంగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ఈ విందులో వీణవంక మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల నుండి ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రార్థనల అనంతరం అందరూ కలిసి విందులో పాల్గొని సోదర భావాన్ని చాటారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు మాట్లాడుతూ... గంగా-జమునా తెహజీబ్ సంస్కృతిని కాపాడుతూ ప్రభుత్వం అన్ని పండుగలకు సమాన ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ముస్లిం సోదరులకు ముందస్తుగా రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎక్కటి రఘుపాల్ రెడ్డి, సర్పంచులు రామిడి సంపత్ రెడ్డి, సర్పంచ్ ఫోరంల అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, అప్పల తిరుమల శంకర్, రమ్య అనిల్, ఉప సర్పంచ్ పసియోద్దీన్, జమ్మికుంట మార్కెట్ డైరెక్టర్ రషీద్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సాహెబ్ హుస్సేన్, ఏలే మధుసూదన్, తహశీల్దార్ రాజమల్లు, నాయబ్ తహసిల్దార్ నిజాముద్దీన్, ఆర్ఐలు రవి, నర్సయ్య, జీపిఓలు, కుబ మసీద్ ప్రెసిడెంట్ కమరుద్దీన్, బొంగోని పెద్ద రాజయ్య, సత్యనారాయణ, జగన్ రెడ్డి, సోహెల్, గుహ మజీద్ ప్రెసిడెంట్ కామారుద్దీన్, జామ మజీద్ ప్రెసిడెంట్ జాఫర్, సెక్రటరీ ముస్తాక్ అహ్మద్, నకియా దిన్, సోయల్, రిజ్వాన్, మహ్మద్, సాకేత్, షాదబ్, ముఫాసిర్, హర్కాం తదితరులు పాల్గొన్నారు.

# అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

## - పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా రంజాన్ తోఫా పంపిణీ

**సూర్య చిగురుమామిడి**



చిగురుమామిడి మండలములోని ఉల్లంపెల్లి గ్రామములోని ముస్లిం సోదర సోదరీమణులకు ఈ తోప తో ఉపయోగకరంగా ఉంటుందని గొల్లపల్లి సర్పంచ్ అలవాల శంకర్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందని,ప్రతి పండుగను ప్రజలతో కలిసి జరుపుకుంటూ వారి జీవితాల్లో సంతోషాలు నింపడమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని ఉల్లంపల్లి సర్పంచ్ అలవాల శంకర్ తెలిపారు.రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి,మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు ఉల్లంపల్లి గ్రామ సర్పంచ్ అలువాల శంకర్ ఆధ్వర్యంలో స్థానిక కాష తుర్క మసీదు ప్రాంగణంలో రంజాన్ మాసంలో ఉపవాసాలు పాటిస్తూ,ప్రార్థనలు చేసే ముస్లిం సోదరులకు ఈ తోఫా ఎంతో ఉపయోగకరంగా ఉండేలా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పంపిని చేయటం జరిగిందని సర్పంచ్ శంకర్ పేర్కొన్నారు.రంజాన్ అనేది త్యాగం, సహనం, దానం,సోదరభావాన్ని పెంపొందించే పవిత్రమైన పండుగన్నారు. ప్రభుత్వం అందిస్తున్న రంజాన్ తోఫా,పేద,మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థికంగా తోడ్పడటమే కాకుండా,వారి ఆనందాన్ని రెట్టింపు చేస్తుందన్నారు.గ్రామంలో సామరస్య వాతావరణంలో ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు.రంజాన్ పండుగ సందర్భంగా ఉల్లంపల్లి గ్రామ ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డీసీసీ ప్రచార కార్యదర్శి చిట్టుమల్ల రవీందర్,మాజీ జడ్పీటీసీ గీకూరు రవీందర్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కానవేణి శివ కుమార్,వార్డు సభ్యులు సయ్యద్ షరీఫ్,ఆర్ ఐ నాగరాజు,పంచాయతీ కార్యదర్శి జ్యోతి,జిపిఓ రాములు,చీమూర్తి నర్సయ్య,ఎస్ డి కామాల్, అలీఫ్,ప్రజాప్రతినిధులు, అధికారులు,స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## నవోదయలో సీట్ సాధించిన శివతేజ

**సూర్య జగిత్యాల ప్రతినిధి**



జగిత్యాల పట్టణంలోని పోచమ్మ వాడకు చెందిన అనుమల్ల శివతేజ అనే విద్యార్థి జగిత్యాల జిల్లా లోని నవోదయ విద్యా కేంద్రంలో సీటు సాధించి నట్లు జ్ఞన అకాడమీ నిర్వాహకులు తెలిపారు. నవోదయ పరీక్ష ఫలితాలలో శివతేజ జిల్లాస్థాయి లో నాలుగవ ర్యాంక్ సాధించి కోరుట్ల పట్టణంలో గల నవోదయ విద్యా కేంద్రంలో సీట్ సాధించడం పట్ల విద్యార్థి తల్లిదండ్రులు అనుమల్ల మహేష్, రజిని ఆనందం వ్యక్తం చేశారు. కాగా శివతేజ ఇటీవల వెలువడిన ఆల్ ఇండియా సైనిక్ స్కూల్స్ పరీక్ష ఫలితాలను రాష్ట్రస్థాయిలో ఉత్తమ ర్యాంక్ సాధించడం గమనార్హం. ఈ సందర్భంగా శివతేజను జ్ఞాన అకాడమీ నిర్వాహకులు, తల్లిదండ్రులు స్వీట్స్ తినిపించి అభినందనలు తెలిపారు.

## "అయ్యా... ఫించన్ ఇప్పించండి... బ్రతికే ఉన్నా!"

**సూర్య కోనరావుపేట**



రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలంలోని నిజామాబాద్ గ్రామానికి చెందిన మాదాసు నర్సవ్వ అనే వృద్ధురాలి వేదన ఇది. జీవించి ఉన్నప్పటికీ ప్రభుత్వ రికార్డుల్లో మృతురాలిగా నమోదు కావడంతో, ఆమెకు రావాల్సిన పింఛన్ నిలిచిపోయింది. "అయ్యా... నేను బ్రతికే ఉన్నా... ఫించన్ ఇప్పించండి" అంటూ అధికారులను వేడుకుంటున్న నర్సవ్వ, గత కొంతకాలంగా కార్యాలయాల చుట్టూ తిరుగుతూ అలసిపోయింది. భర్త మరణించిన తర్వాత జీవనాధారం కోల్పోయిన ఆమెకు పింఛన్ ఒక్కటే ఆధారం. కానీ రికార్డుల పొరపాటుతో అది కూడా దూరమైంది.తనను చనిపోయినట్లుగా నమోదు చేయడం వల్ల ఏ పింఛన్ కూడా అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నానని ఆమె కన్నీటి పర్యంతం అవుతున్నారు. పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా స్పందన లేకపోవడం అధికారుల నిర్లక్ష్యాన్ని ప్రశ్నించుతోంది.ఇప్పటికైనా అధికారులు స్పందించి రికార్డులను సరిచేసి, బ్రతికే ఉన్న ఈ వృద్ధురాలికి తక్షణమే పింఛన్ మంజూరు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ఇంకా కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నా

### - మాజీ మంత్రి జీవన్ రెడ్డి

**సూర్య జగిత్యాల ప్రతినిధి**



తనకు శ్రీరామచంద్రుల వారే ఆదర్శమని పార్టీ మారిన నాడు అన్ని మారాల్సి వస్తుందని మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు. స్టిల్ ఐయామ్ ఇన్ కాంగ్రెస్ అని చెప్పుకున్న జీవన్ రెడ్డి తాను పార్టీ నుండి బయటకు వెళ్లడానికి ప్రధాన పాత్రధారి జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమారేనని పేర్కొన్నారు. జగిత్యాల పట్టణంలోని జీవన్ రెడ్డి నివాసం ఇందిరా భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ బుజ్జగిస్తే కాంగ్రెస్ కొనసాగుతారా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు మొదట జగిత్యాల సమస్య పరిష్కారం అయితదా..? తనకైతే పరిష్కారం అవుతుందనే నమ్మకం అయితే లేదన్నారు. పార్టీలో తన మిత్రులు ఉన్నారని వారు మాట్లాడుతున్నారని.. తన అభిప్రాయాన్ని వారికి చెబుతున్నానని.. వారు కూడా స్పందిస్తున్నట్లు వెల్లడించారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఏ పార్టీలో ఉన్నారో తెలియదని, కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల్లో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ జోక్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. తాను పార్టీ మారాలని ఆలోచన రావడానికి ఎమ్మెల్యేనే ప్రధాన కారణమని మాజీ మంత్రి జీవన్ రెడ్డి ఆరోపించారు. అయితే నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీతో ఉన్న అనుబంధం వల్ల ఇపుడు కాంగ్రెస్ పార్టీని వీడడం మామూలు విషయం కాదని జీవన్ రెడ్డి తెలిపారు. ఇలాంటి పరిస్థితులు ఉత్పన్నం కావడానికి కాంగ్రెస్ పార్టీ అధిష్టానం బాధ్యత కూడా అని ఆరోపించారు.

## తాళం వేసి అన్న ఇంట్లో చోరీ

**సూర్య - పెద్దపల్లి రూరల్**

పెద్దపల్లి మండలం తుర్కలమద్దికుంటలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. గ్రామానికి చెందిన గంట్ల మణెమ్మ మల్లారెడ్డి దంపతులు అనారోగ్యంతో తన కుమారుడి దగ్గరకు పెద్దపల్లికి 3 రోజుల క్రితం వెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చే సరికి ఇంటి తాళం పగులగొట్టి ఇంట్లో బీరువాను ధ్వంసం చేశారు. బీరువాలోని 2 తులాల బంగారం, 10 వేల నగదు గుర్తుతెలియని వ్యక్తులు దోచుకెళ్ళారని మల్లారెడ్డి తెలిపారు.

## కలెక్టరేట్‌లో ఘనంగా ఇఫ్తార్ విందు

**సూర్య జగిత్యాల ప్రతినిధి**




జగిత్యాల జిల్లాలో మంగళవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా ఇఫ్తార్ విందు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు బి.ఎస్.లత, బి.రాజ గౌడ్‌లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ లు మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసం సమాజంలో పరస్పర గౌరవం, సహనం, సహాయ సహకారాల విలువలను పెంపొందించే గొప్ప సమయమని తెలిపారు. భారతదేశం భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొంటూ, ఇఫ్తార్ విందుల వంటి కార్యక్రమాలు సామాజిక సమైక్యతను బలోపేతం చేస్తాయని అన్నారు.అన్ని మతాల మధ్య మంచి వాతావరణం నెలకొల్పడంలో ఇలాంటి కార్యక్రమాలు ముఖ్య పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణులకు ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, డి.ఆర్.డి. ఓ రఘువరన్, డి. పి.ఆర్.ఓ నరేష్, కలెక్టరేట్ ఏ.వో హకీమ్, ట్రెసా జిల్లా అధ్యక్షులు వకీల్,టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు నాగేందర్, జిల్లా స్థాయి అధికారులు, వివిధ ప్రభుత్వ ఉద్యోగ సంఘాల నాయకులు, ముస్లిం మత పెద్దలు, వివిధ స్థాయిల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హత్యాయత్నం కేసులో వ్యక్తి రిమాండ్

**సూర్య ధర్మపురి**



భార్యపై హత్యాయత్నం చేసిన కేసులో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ధర్మపురి ఎస్సై జి.మహేష్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ధర్మపురి పట్టణ ప్రాంతంలో నివాసం ఉండే బడుగు నవీన్ (23) కు తుమ్మెనాల గ్రామానికి చెందిన మసీదు రమ్య (22) నాలుగు సంవత్సరాల క్రితం ప్రేమించి వివాహం చేసుకున్నారు. వివాహం జరిగిన కొన్ని నెలల తర్వాత నుండి వారి మధ్య అనేక విషయాలలో గొడవలు జరుగగా పెద్ద మనుషులలో పలుమార్లు చర్చలు జరిగినాయి. కాగా ఐదు నెలల క్రితం భర్తతో గొడవపడి రమ్య తన తల్లితో కలిసి ఉంటుంది. అప్పటినుండి తన భార్యపై కోపం పెంచుకొన్న నవీన్ సోమవారం తన భార్య దగ్గరికి వెళ్లి తన వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ని ఆమెపై పోసి నిప్పంటించినాడు. స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం రమ్య వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో బాధితురాలి తల్లి రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై మహేష్ తెలిపారు.

## ధర్మపురి పోలీస్ స్టేషన్లో స్వచ్ఛభారత్

**సూర్య ధర్మపురి**



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేప ట్టిన 99 రోజుల ప్రజా పాలనలో భాగంగా మంగళవారం ధర్మపురి పోలీస్ స్టేషన్ ఆవరణలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు ధర్మపురి పోలీస్ స్టేషన్లో నరసింహారెడ్డి, ఎస్సై మహేష్ ల ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది కలిసి స్వచ్ఛభారత్ పోలీస్ స్టేషన్ ఆవరణలో పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా సిఐ రామ నర్సింహారెడ్డి, ఎస్సై మహేష్‌లు మాట్లాడుతూ ప్రజలందరూ కూడా తమ తమ పరిసరాలని పరిశుభ్రంగా ఉంచుకోవాలని దాని ద్వారా అనారోగ్యాన్ని దూరం చేయ వచ్చుని సూచించారు.

## పంచాయతీ కార్యదర్శి పై డిఎల్పీఓ విచారణ...

**సూర్య, వీణవంక**



వీణవంక మండలంలోని వల్భాపూర్ పంచాయతీ కార్యదరర్శి పై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం డిఎల్పీఓ శ్రీనివాస్ వల్భాపూర్ గ్రామంను సందర్శించారు. ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి పలువురిని విచారించి డీపీవోకు చేయగా విచారణకు పూర్తి వివరాలు సేకరించడం జరిగింది. అనంతరం ఉన్నతాధికారులకు తెలియజేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ, మండల సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# వేములవాడలో బీజేపీ డబుల్ అటాక్..!

**- కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలెక్కడ ? - తహశీల్దార్ కు వినతి..- ఎంఐఎం దిష్టిబొమ్మ దగ్ధం**

**సూర్య, వేములవాడ**

వేములవాడ పట్టణంలో మంగళవారం రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. అటు అధికార కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ఎండగడుతూనే, ఇటు దేశభక్తి విషయంలో రాజీ లేదంటూ ఎంఐఎం పార్టీకి బీజేపీ నాయకులు గట్టి హెచ్చరికలు జారీ చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని వేములవాడ పట్టణ బీజేపీ నాయకులు విమర్శించారు. ప్రభుత్వం గద్దెనెక్కి నెలలు గడుస్తున్నా, అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందడంలో తీవ్ర జాప్యం జరుగుతోందని మండిపడ్డారు. ఈ మేరకు పట్టణ అధ్యక్షులు రాపెల్లి శ్రీధర్ ఆధ్వర్యంలో



నాయకులు తహసిల్దార్ కార్యాలయానికి భారీ ర్యాలీగా వెళ్లి వినతిపత్రం సమర్పించారు. ప్రజల ఓట్లతో గెలిచి, ఇప్పుడు ప్రజలను వంచించడం సరికాదని నిలదీశారు. వందేమాతరాన్ని అవమానిస్తే సహించేది హెచ్చరించారు. అసెంబ్లీ ప్రాంగణంలో వందేమాతరం గీతాన్ని అవమానించి బయటకు నడిచిన ఎంఐఎం పార్టీ వైఖరిని నిరసిస్తూ ఆ పార్టీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకులు ప్రతాప రామకృష్ణ, రేగుల మల్లికార్జున్ మాట్లాడుతూ భారతదేశంలో నివసించే ప్రతి ఒక్కరూ జాతీయ గీతాన్ని, వందేమాతరాన్ని గౌరవించాల్సిందేనని స్పష్టం చేశారు. దేశభక్తి లేని రాజకీయాలకు కాలం చెల్లిందని, జాతీయ భావాలను కించపరిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కొండ్లెపు ముత్యం, మైలారం శ్రీనివాస్, వంగల శ్రీనివాస్, మరియు నాయకులు రేగుల శ్రీకాంత్, బోనాల శివ, మామిండ్ల లక్ష్మీరాజం, రేగుల రాజ్ కుమార్, బిల్ల కృష్ణ, గుడిసె మనోజ్ కుమార్, వివేక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వేములవాడ సమగ్ర అభివృద్ధే లక్ష్యం

**- మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు**

**- 4వ వార్డులో సీసీ రోడ్ల పరిశీలన**

**సూర్య, వేములవాడ**

వేములవాడ పట్టణంలోని 4వ వార్డులో మహాలక్ష్మి కమాన్ నుండి జమ్మి చెట్టు వరకు నూతనంగా చేపట్టిన సిసి రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్



చైర్మన్ పుల్కం రాజు, స్థానిక కౌన్సిలర్ తోట రాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవతో పట్టణంలో గతంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలకు పరిష్కారం లభిస్తోందని కొనియాడారు. రోడ్డు నిర్మాణ పనుల్లో ఎక్కడా రాజీ పడకుండా నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, ప్రజలకు ఇబ్బంది కలగకుండా పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఆదర్శ పట్టణంగా వేములవాడ పట్టణంలోని ప్రతి వార్డులో ఉన్న సమస్యలను గుర్తించి, ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఆయన తెలిపారు. రాబోయే రోజుల్లో వేములవాడను రాష్ట్రంలోనే ఒక ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే సహకారంతో వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కొండ రాజశేఖర్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, పలువురు కాంగ్రెస్ నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## కవులు భవిష్యత్ తరాలకు బాటలు వెయ్యాలి

**- డిఎస్పి నాగేంద్ర చారి**

**సూర్య సిరిసిల్ల టౌన్**

సమాజంలో జరుగుతున్న రుగ్మతలపై కవులు తమ గళాన్ని ఎలుగెత్తి చాటాలని,కవులు భవిష్యత్ తరాలకు బాటలు వెయ్యాలని సిరిసిల్ల డిఎస్పి నాగేంద్ర చారి పిలుపునిచ్చారు.మంగళ



వారం సిరిసిల్ల సాహితి సమితి ఆధ్వర్యంలో శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది కవి సమ్మేళనాన్ని సిరిసిల్ల గాంధీ నగర్ హనుమాన్ దేవాలయంలో నిర్వహించారు.ఇట్టి కవి సమ్మేళనానికి ముఖ్య అతిథిగా సిరిసిల్ల డి.ఎస్.పి కత్రోజు నాగేంద్ర చారి,సిరిసిల్ల మున్సిపల్ చైర్పర్సన్ జిందం కళాచక్రపాణి,మానేరు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు చింతోజి భాస్కర్ హాజరయ్యారు.ఈ సందర్భంగా కవులు ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని కవిత గానం చేశారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ కలం పట్టిన వీరులు కవులు సమాజంలో జరుగుతున్న అన్యాయాలను, అక్రమాలను ఒక సైనికుడిలా ఎదిరించి నిద్రపోతున్న సమాజాన్ని లేపే వ్యక్తులే కవులని కళాకారులు రచయితలని అన్నారు.ఈ సందర్భంగా కవులను శాలువాలు ప్రశంసా పత్రాలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో సిరిసిల్ల సాహిత్య సమితి గౌరవ అధ్యక్షులు పోరండ్ల మురళీధర్,అధ్యక్షులు జనపాల శంకరయ్య,ప్రధాన కార్యదర్శి వెంగళ లక్ష్మణ్, ఉపాధ్యక్షులు నేరోజు రమేష్,అంకారపు జ్ఞానోబా, గడ్డం పరశు రాములు,తదితర కవులు,రచయితలు పాల్గొన్నారు.

## వీణవంకలో ముగిసిన క్రీడా పాఠశాల ఎంపికలు

**- జిల్లా స్థాయికి ప్రతిభావంతుల ఎంపిక**

**సూర్య, వీణవంక**

రాష్ట్ర క్రీడా పాఠశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన మండల స్థాయి ఎంపిక పోటీలు మంగళవారం వీణవంక ప్రభుత్వ ఉన్నత పాఠశాల



మైదానంలో ఉత్సాహంగా జరిగాయి. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి ఎస్. శోభారాణి మాట్లాడుతూ విద్యార్థుల్లోని క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఈ పోటీలు దోహదపడతాయని తెలిపారు. ?మండలంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన మూడవ తరగతి విద్యార్థులకు పలు విభాగాల్లో క్రీడలు నిర్వహించారు. ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఆమె ప్రకటించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయురాలు వి. శాంత, ఎస్.జి.ఎఫ్ కార్యదర్శి శ్రీనివాస్, మండలంలోని పలువురు ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులను ఉత్సాహపరిచారు.

## ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

**సూర్య, వీణవంక**

వీణవంక మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో గ్రామ సభ నిర్వహించిన అనంతరం మహిళా దినోత్సవ వేడుకలను గ్రామ



సర్పంచ్ కర్ర విజయ భగవాన్ రెడ్డి మహిళలను శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... ఓ వ్యక్తి జీవితంలో స్త్రీ చాలా పాత్రలు పోషిస్తుందని, తల్లి మొదలు, చెల్లి, భార్య, గురువు ఇలా ఎన్నో బాధ్యతలను ఆమె అలవోకగా చేయగలదని, ఆమెలోని గొప్పదనం ఏంటంటే ఓ వైపు ఇంటిని చక్కబెడుతూనే మరోవైపు సంఘంలోనూ ఎన్నో రోల్స్ పోషిస్తుందని పేర్కొన్నారు. వీటన్నింటికి ప్రతీకగా ప్రపంచంలోని మహిళల కోసం 'అంతర్జాతీయ మహిళా దినోత్సవం'ని ఏర్పాటు చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఉయ్యాల రాణి రాజు, ఉయ్యాల నాగరాజు, పైడిమల్లి శ్రీదేవి శ్రీనివాస్, పోతుల అజయ్, వడ్డెపెల్లి సుజాత పింటూ, పోతుల శ్రీలత చిన్నస్వామి, బండి మహేష్, పోతుల వనజ సురేష్, గ్రామ ప్రజలు, మహిళలు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## శాతవాహన ఉర్దూ సహాయ ఆచార్యునికి పేటెంట్

**సూర్య కరీంనగర్**

శాతవాహన విశ్వవిద్యాలయ ఆర్ట్స్ కళాశాల ఉర్దూ సహాయ ఆచార్యులు డా.నజిముద్దీన్ మునవర్ కి పేటెంట్ లభించింది. "వెర్నాక్యూలర్ లాంగ్వేజ్ ట్రాన్సలేషన్ డివైస్" అనే అంశంపై పేటెంట్ లభించింది. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య యు.ఉమేష్ కుమార్, డా.మునవర్ను అభినందిస్తూ, ఇతర అధ్యాపకులు కూడా మరిన్ని పరిశో ధనలు చేయాలని విశ్వవిద్యాలయాన్ని ముందుకు తీసుకెళ్లాలని అభినం దనలు తెలియజేశారు. డాక్టర్ నజిముద్దీన్ మునవర్ ఉర్దూ విభాగంలో సహాయ ఆచార్యులుగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన పలు పుస్తకాలతో పాటు, అంతర్జాతీయ సెమినార్లలో, జర్నల్స్ లో తన పరిశోధన పత్రాలు సమర్పించారు. ప్రస్తుతం ఆయన బోర్డు అఫ్ స్టడీస్ ఉర్దూ చైర్మన్గా, చీఫ్ వార్డెన్ గా, స్పోర్ట్స్ బోర్డు సెక్రెటరీ గా పనిచేస్తున్నారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య సతీష్ కుమార్, ఓ ఎస్ డి టు వి సి డా. హరికాంత్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డా. పద్మావతి , ఉర్దూ శాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ అబ్రారుల్ బాక్వి, డా. జాఫర్, డా. హుమెరా ఇతర ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు డా. నజిముద్దీన్ మునవర్ నుఅభినందించారు.

## లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలి..

**- ఇన్చార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.పుష్పలత**

**సూర్య సిరిసిల్ల టౌన్**

ఈ నెల 28న జరిగే లోక్ అదాలత్ ను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకొని,కోర్టు పెండింగ్ లో ఉన్న కేసులను పరిష్కరించుకోవాలని ఇన్చార్జి




జిల్లా ప్రధాన న్యాయమూర్తి,జిల్లా న్యాయ సేవాధికర సంస్థ అధ్యక్షురాలు బి.పుష్పలత అన్నారు.మంగళవారం జిల్లా కోర్టు సముదాయం లో జిల్లాకు చెందిన న్యాయమూర్తులు,పబ్లిక్ ప్రాసిక్యూటర్స్,పోలీసు అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ సాధ్యమైనంతవరకు ఎక్కువ కేసుల పరిష్కారం చేయాలని సూచించారు.పోలీసు అధికారులకు పలు సలహాలు,సూచనలు చేశారు.ఈ సమావేశంలో అదనపు జిల్లా ఎస్పీ డి. చంద్రయ్య,సీనియర్ సివిల్ జడ్జి,సిరిసిల్ల ఇన్చార్జి కార్యదర్శి డిఎల్ ఎస్ఏ పి.లక్ష్మణాచారి,సీనియర్ సివిల్ జడ్జి వేములవాడ అజయ్ కుమార్ జాదవ్,సిరిసిల్ల,వేములవాడ డీఎస్పీలు నాగేంద్ర చారి,శ్రీనివాసులు,మేజిస్ట్రేట్లు ప్రవీణ్,సృజన, జ్యోతిర్మయి, మేఘన,పోలీసు అధికారులు,కోర్టు మానిటరింగ్ పోలీసులు పాల్గొన్నారు.



## మల్కపేట రిజార్వాయర్ నీటి విడుదల

**- రైతులకు ఊరట**

**సూర్య కోనరావుపేట**

కోనరావుపేట మండలంలోని వెంకట్రావుపేట, కొండాపురం, బావుసాయిపేట, మామిడిపల్లి గ్రామాల్లో భూగర్భ జలాలు తగ్గిపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కలిసి మల్కపేట రిజర్వాయర్ నుంచి ఎడమ కాలువ ద్వారా నీటిని విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.గద్దగుట్ట చెరువు ద్వారా నీరు వెంకట్రావుపేట, కొండాపురం మీదుగా మూల వాగులోకి చేరితే భూగర్భ జలాలు పెరిగి పంటలకు ఉపయోగపడుతుందని రైతులు వివరించారు. రైతుల అభ్యర్థనను గమనించిన ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తక్షణమే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడిన వెంటనే అధికారులు మల్కపేట రిజర్వాయర్ నుంచి మంగళవారం నీటి విడుదల చేశారు.నీరు విడుదలతో పంటలకు ఊరట లభించడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చుకాయల ఎల్లయ్య,కాంగ్రెస్ మండల అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ పాషా, సర్పంచ్ మస్కూరి కాశీరాం, మాజీ జడ్పీటిసి గొట్టె రుక్మిణి, బండ నర్సయ్య యాదవ్,పల్లె రవీందర్ రెడ్డి, రాస రవీందర్, దేవరకొండ నర్సించారి,మంతెన మల్లేశం, మల్లయ్య, కుమ్మరి దేవదాస్ , రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్జీ-2లో అత్యధికంగా 93.29 లక్షల టన్నుల బొగ్గు రవాణా

**- జీఎం బండి వెంకటయ్య**

**సూర్య, సెంటినరీ కాలనీ**

సింగరేణి సంస్థ ఆర్జీ-2 ఏరియాలో 2025-26 సంవత్సరానికి గాను మంగళవారం అత్యధికంగా బొగ్గు రవాణా జరిగింది. ఈ నెల 15వ తేదీ వరకు 93.29 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేయడం జరిగింది. 2023-24 సంవత్సరంలో 93.06 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేయగా గతంలో ఎప్పుడు లేనంతగా 2025-26 సంవత్సరానికి గాను 93.29 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేసి చరిత్ర



సృష్టించారు. ఈ సందర్భంగా కార్మికులను, మహిళ ఉద్యోగులను,సూపర్ వైజర్ లను, అధికారులను, యూనియన్ నాయకులను జనరల్ మేనేజర్ బండి వెంకటయ్య అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొగ్గు రవాణాలో కీలకంగా ప్రతి ఒక్కరు పనిచేశారని, అందరి స్ఫూర్తితోనే ఇది సాధ్యమైందన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి

**-గృహ ప్రవేశానికి సిద్ధం చేయాలి -కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**సూర్య రాజన్న సిరిసిల్ల**

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లాలో ఇందిరమ్మ ఇండ్లు, గ్రామ సమాఖ్య, గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్వాడీ కేంద్రాలు, టాయిలెట్ల నిర్మాణాలపై జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, ఏఈ పీఆర్, హౌసింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులు త్వరితగతిన ఇళ్లు పూర్తి చేసుకునేలా సహకారం అందించాలని సూచించారు. తుది దశలో ఉన్న ఇండ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేసి ఈ నెల ఆఖరున మెగా గృహ ప్రవేశ కార్యక్రమానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. మండల స్థాయి అధికారులు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో సమావేశం ఏర్పాటు చేయాలని, వారి సమస్యలు



పరిష్కరించాలని తెలిపారు. వడ్రంగి, ప్లంబర్, మేస్త్రి ఇతర ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ప్రభుత్వం సూచించిన బడ్జెట్ లోనే ఇండ్లు నిర్మించుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలోని రెండు మున్సిపాలిటీలు, ఆయా మండలాల్లో గుడిసె ల్లో ఉంటున్న వారి వివరాలు సేకరించాలని, వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని ఆదేశించారు. హౌసింగ్, మున్సిపల్ అధికారులు ఇండ్ల నిర్మాణాల ఫోటోలు ఎప్పటికప్పుడు ఆన్లైన్ లో అప్లోడ్ చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ విషయమై జడ్పీ డిప్యూటీ సీఈవో, హౌసింగ్. ఇతర అధికారులను కలెక్టర్ అభినందించారు. ఇదే స్ఫూర్తితో జిల్లాకు కేటాయించిన లక్ష్యం మేరకు ఇండ్లను పూర్తి చేయించాలని ఆదేశించారు.జిల్లాలో గ్రామ సమాఖ్య భవనాలు, గ్రామపంచాయతీ భవనాలు, అంగన్వాడీ కేంద్ర భవనాల పనులను పూర్తి చేయాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ సద్వినియోగం చేసుకోవాలని ఆదేశించారు. అన్ని భవనాలను పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా వసతులు కల్పించిన తర్వాత ప్రారంభించాలని స్పష్టం చేశారు.సమావేశంలో హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు, డీఆర్డీఓ గీత, హౌసింగ్ డీఈ సాజిద్, ఈఈ పీఆర్ సుదర్శన్ రెడ్డి, చందుర్తి మండల ప్రత్యేక అధికారి, పశు వైద్య, సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పోలీసులకు కర్తవ్యమే కాదు... ఆరోగ్యం కూడా ముఖ్యమే...

**- పోలీస్ సిబ్బందికి నిత్య డయాగ్నొస్టిక్ సెంటర్ వైద్య పరీక్షలు**

**సూర్య జూలపల్లి**



పోలీసులకు కర్తవ్యమే కాదు... ఆరోగ్యం కూడా ముఖ్యమేనని బాలరాజుపల్లి ఉపసర్పంచ్ కోరు కంటి హరికిషన్ అన్నారు. పెద్దపల్లి కి చెందిన నిత్య డయాగ్నొస్టిక్ సెంటర్ ద్వారా జూలపల్లి పోలీస్ స్టేషన్‌లో పోలీస్ సిబ్బందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా రక్త పరీక్షలు సహా పలు ఆరోగ్య పరీక్షలు చేపట్టారు.ఈ సందర్భంగా హరికిషన్ మాట్లాడుతూ, ప్రజల భద్రత కోసం నిరంతరం కష్టపడే పోలీస్ సిబ్బంది తమ ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. కఠిన విధుల్లో నిమగ్నమై ఉండడం వల్ల వారికి సాధారణ వ్యాయామం చేసేందుకు సమయం దొరకకపోవడం ప్రత్యక్షంగా గుర్తించే వారి కోసం శిబిరం ఏర్పాటు చేశామని తెలిపారు. పోలీసులు కాలానుగుణంగా సంపూర్ణ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం అత్యంత అవసరమని పేర్కొన్నారు.ఈ ఆరోగ్య శిబిరంతో పోలీసులకు ఎంతో మేలు చేస్తుందని,కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన నిత్య డయాగ్నొస్టిక్ సెంటర్ యాజమాన్యాన్ని జూలపల్లి సబ్ ఇన్స్పెక్టర్ సనత్ కుమార్ శాలువాలతో సన్మానించి అభినందించారు.ఈ కార్యక్రమంలో డయాగ్నొస్టిక్ సెంటర్‌కు చెందిన వెలిశాల అశోక్, మంథని మహేందర్,అడువాల తిరుపతి,రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## సాయిల్ హెల్త్ కార్డు,ఫార్మర్ కిట్ పంపిణీ

**సూర్య సారంగాపూర్**

రైతులకి సాయిల్ హెల్త్ కార్డు తో పాటు ఫార్మర్ కిట్ లు పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయ అధికారి ప్రదీప్ రెడ్డి తెలిపారు. జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ లో భాగంగా సారంగాపూర్ రైతు వేదికలో రేచపల్లి గ్రామ రైతులకి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యవసాయ శాస్త్రవేత్తలుతో ప్రకృతి వ్యవసాయం పైన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతులు సహజ వ్యవసాయ పద్ధతుల ద్వారా వ్యవసాయం చేస్తూ నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించడం జరిగింది. రసాయనాలు ద్వారా అధికంగా ఆధారపడడం వలన నేల ఆరోగ్యం క్షీణించడం తో పాటు పంటల దిగుబడి తగ్గడమే కాకుండా కాన్సర్ వంటి అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి కావున ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు దృష్టి సారించాలనిసూచించారు. కార్యక్రమంలో ఏఓ ప్రదీప్ రెడ్డి, Aeo వెంకటేష్ మరియు రైతులు పాల్గొన్నారు.




## వల్బాపూర్‌లో 'నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్'పై అవగాహన

**- రైతులకు కిట్ల పంపిణీ**

**సూర్య, వీణవంక**



వీణవంక మండలంలోని వల్భాపూర్ రైతువేదికలో రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ (ఎన్ఎంఎన్ఎఫ్) పై రైతులకు మంగళవారం విస్తృత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి గణేష్ మాట్లాడుతూ... ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ మిషన్ కింద మండలంలోని కనపర్తి, బేతిగల్ గ్రామాల నుండి మొత్తం 125 మంది రైతులను ఎంపిక చేసినట్లు అధికారి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శాస్త్రవేత్తలు భూసార పరీక్షల ప్రాముఖ్యతను వివరించారు. రసాయన ఎరువులకు ప్రత్యామ్నాయంగా జీవామృతం, జీవన ఎరువుల తయారీ, వాటి వాడకం వల్ల కలిగే దీర్ఘకాలిక లాభాలను రైతులకు వివరించారు. అనంతరం ఎంపికైన రైతులకు మిషన్ కిట్లను (క్యాలెండర్, ఐడెంటిటీ కార్డులు, అవగాహన పుస్తకాలు) అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి గణేష్ తో పాటు, వ్యవసాయ విస్తరణ అధికారులు సంగీత, అచ్యుత్, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## చెల్పూర్ లో జాతీయ జెండా గద్దె కూల్చివేత

**సూర్య, హుజురాబాద్ రూరల్**



హుజురాబాద్ మండలం చెల్పూర్ గ్రామంలో బస్టాండ్ వద్ద ఆటో యూనియన్ నిర్మించిన జాతీయ జెండా గద్దె ను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని ఆటో డ్రైవర్ కనకం దేవేందర్ అన్నారు. ఆటో యూని యన్ తరపున నిర్మించుకున్న జాతీయ జెండా గద్దెను వారం క్రితం గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని, హుజురాబాద్ తహశీల్దార్, టౌన్ సిఐ లు వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## 11కెవి విద్యుత్ వైర్లు తొలగించాలని ఎస్ ఎస్ఇ కి వినతి

**సూర్య గంగాధర**



గంగాధర మండలం తాడి జెర్రీ గ్రామంలో ని ఎస్ సి కాలనీ లో గల11 కేవి విద్యుత్ వైర్ లను తొలగించాలని కరీంనగర్ జిల్లా ఎస్ ఇ రవిందర్ కు డీసీసీ ప్రెసిడెంట్ చొప్పదండి నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం సిఫార్సు లేఖను అందజేసినట్లు తాడి జెర్రీ గ్రామ సర్పంచ్ రామిడి రాజిరెడ్డి తెలిపారు. గత కొన్ని సంవత్సరాలనుండి 11 కెవి వైర్లతో ఇబ్బందులు ఉన్నాయని వాటి మార్చాలని తెలిపారు. ఈయన వెంట కాంగ్రెస్ నాయకులు గుంటుకు రవీందర్ ఉన్నారు.

## అన్న ప్రసాద వితరణ

**సూర్య కరీంనగర్ టౌన్**



మేము సైతం యువసేన ఫౌండేషన్ ఆధ్వర్యంలో మౌనిక అచ్యుత్ వారి యొక్క పిల్లల పుట్టిన రోజు సంద ర్భంగా కూలీ పని చేసుకునే పుడితే ప్రాంతాల్లో నివసించే వారికి వేసవికాలం సందర్భంగా వారి యొక్క అవసరాల నిమిత్తం రంజన్, అన్న ప్రసాద వితరణ, పిల్లలకు బాల్స్, చెస్ బోర్డ్, మహిళలకు వాటర్ బాటిల్స్ పంపిణీచేయడం జరిగింది. ఇందులో ఫౌండేషన్ అధ్యక్షురాలు చకిలం స్వప్న శ్రీనివాస్ రమేష్ తదితరులు పాల్గొనడం జరిగింది.

## 23వ తేదీన లేబర్ కమిషనర్ వద్ద జరిగే మహా ధర్నా ను విజయవంతం చేయాలి

**సూర్య, సెంటినరీ కాలనీ**



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడుల రద్దుకై ఈ నెల 23వ తేదీన హైదరాబాద్ లేబర్ కమిషనర్ వద్ద జరిగే మహా ధర్నా ను జయప్రదం చేయాలనీ సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్టీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.అశోక్ పిలుపుని చ్చారు. భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్టీయూ) తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్ లేబర్ కమిషనర్ వద్ద జరిగే మహాధర్నా జయప్రదం కై 8వ కాలనీ లో సివిక్ సెక్షన్లలో పోస్టర్ విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.అశోక్ మాట్లాడుతూ బీజేపీ మోదీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడు ల రద్దుకై, ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జరిగే మహా ధర్నాకు కార్మికుల అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టీయూ నాయకులు వీరస్వామి, డి.పద్మ, జాటో జలపతి నాయక్, కవిత, రాజమ్మ, మహేందర్, బుజ్జమ్మ, ఎల్. శాంతమ్మ, దుర్గం దుర్గమ్మ ,శంకర్, స్వరూప, సాగర్ల నరసయ్య, తోట పద్మ ,ఘట్టక్క, తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్ 'ప్రిమిసెస్ మెయింటెనెన్స్

**- క్లీన్ & గ్రీన్' గా ఉండాలి**

**- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**

**సూర్య జగిత్యాల**



పోలీస్ స్టేషన్ కి వచ్చే బాధితులకు ఆహ్లాదకరమైన వాతావరణం కలిగించే విధంగా పోలీస్ స్టేషన్ పరిసరాలు ఉండాలని పోలీస్ స్టేషన్ 'ప్రిమిసెస్ మెయింటెనెన్స్ – క్లీన్ & గ్రీన్' గా ఉండాలనీజిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అధికారు లను ఆదేశించారు. "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక"లో భాగంగా ఒక మంచి ఉద్దేశంతో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లో పరిధిలో 'ప్రేమిసెస్ మెయింటెనెన్స్ – క్లీన్ & గ్రీన్' కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సంద ర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలలో ఉన్న చెత్తను తొలగించడం, పచ్చద నం పెంపొందించేందుకు మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు చేపట్టారు. పోలీస్ స్టేషన్‌ను పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉంచడం ద్వారా ప్రజలకు మంచి వాతావరణం కల్పించడమే అన్నారు.

## కొడిమ్యాల జూనియర్ కళాశాలకు నూతన ప్రిన్సిపాల్

**సూర్య కొడిమ్యాల**



కొడిమ్యాల మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు నూతన ప్రిన్సిపాల్‌గా పి. గోపాల్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పి. గోపాల్ మాట్లాడుతూ కొడిమ్యాల మండలంలోని గ్రామ ప్రజలు, స్థానిక నాయకులు, అధ్యాపకుల సహకారంతో జూనియర్ కళాశాల సమగ్ర అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో కరీంనగర్ ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ బాధ్యులు ఆంజనేయరావు, మహేంద్ర కుమార్, సత్యనారాయణ, శశిధర్ శర్మ, శివరామ కృష్ణ, జగిత్యాల లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కె. వేణు, కళాశాల అధ్యాపకులు జయపాల్, ప్రమోద్, బాలకృష్ణ, జయశీల, అనిల్ కుమార్, తిరుపతి, నర్సయ్య, సుమన్, భాస్కర్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.